VISALAANDHRA VIJAYAWADA Phone No. 376
4 పేజీలు ఒక అణా రిజిష్టరు నెం. A 193

కేరళలో అఖిలపక్ష ప్రభుత్వం: ప్రజాసోషలిస్టు నాయకుని సూచన

త్రివేండ్రం, మార్చి 16

తిరువాన్కూర్ - కొచ్చిన్ లో శ్రీ పట్టం థానుపిళ్లై నాయకత్వాన కాంగ్రెస్, కమ్యూనిస్టు నాయకులతో కూడిన అఖిలపక్ష ప్రభుత్వం ఏర్పడటం అవసరమని రాష్ట్ర ప్రజా సోషలిస్టు పార్టీ కార్యవర్గ సభ్యుడు శ్రీ జనార్దనన్ నేడు సూచించారు. రాష్ట్రపతి పాలన ఏర్పడటం అవమానకరమన్నారు.

విశాలాంధ్ర
705667
సంపుటి 4 ★ విజయవాడ: శనివారం మార్చి 17; 1956 ★ సంచిక 356

మంచి పాలు
సరసమైన రేట్లు
దొరకు చోటు:
ది మొగల్రాజపురం కో-ఆపరేటివ్
పాలసరఫరా సంఘం, మొగల్రాజపురం.

‘ఆంధ్ర-తెలంగాణా’ పేరుతో విశాలాంధ్ర రాష్ట్ర స్థాపన

15 రాష్ట్రాలు, 7 కేంద్రపాలిత ప్రాంతాలు వుంటాయని పార్లమెంటుకు సమర్పించిన బిల్లులో వివరణ

***

ప్రస్తుత బళ్లారిజిల్లా యావత్తూ ఇప్పటివున్నట్లే మైసూరు రాష్ట్రంలో వుండాలని నిర్ణయం

బెంగాల్ - బీహార్ రాష్ట్రాలు వేరువేరుగా ఉదహరణ : కేవలం సలహాయిచ్చే అధికారంతో మండల కౌన్సిళ్ల ఏర్పాటు

న్యూఢిల్లీ, మార్చి 16

పార్లమెంటు ఉభయసభలకు నేడు సమర్పించబడిన రాష్ట్రాల పునర్నిర్మాణ బిల్లులో 15 రాష్ట్రాలూ, ఏడు కేంద్రపాలిత ప్రాంతాలూ పేర్కొనబడినాయి. విశాలాంధ్ర “ఆంధ్ర-తెలంగాణా” అనే పేరుతో ఉదహరించబడింది. పశ్చిమబెంగాల్, బీహార్ లు వెరువేరు రాష్ట్రాలుగా ఉదహరించబడినాయి.

బిల్లులో కొత్త రాష్ట్రాలు ఈ క్రిందివిధంగా పేర్కొనబడినాయి: 1. ఆంధ్ర - తెలంగాణా, 2. అస్సాం, 3. బీహార్, 4. గుజరాత్, 5. కేరళ, 6. మధ్యప్రదేశ్, 7. మద్రాస్, 8. మహారాష్ట్ర, 9. మైసూరు, 10. ఒరిస్సా, 11. పంజాబు, 12. రాజస్థాన్, 13. ఉత్తరప్రదేశ్, 14. పశ్చిమబెంగాల్, 15. జమ్మూ - కాశ్మీర్.

కేంద్ర పాలిత ప్రాంతాలుగా ఈ క్రింది ప్రాంతాలు పేర్కొనబడినాయి:

(1) బొంబాయి, (2) ఢిల్లీ, (3) హిమాచల ప్రదేశ్, (4) మణిపూర్, (5) త్రిపుర, (6) అండమాన్ నికోబార్, (7) లక్కదీవులు.

బిల్లులో 121 నిబంధనలున్నాయి. అవిగాక వివిధ రాష్ట్రాలలోని ప్రాంతాలనూ, కేంద్ర ప్రభుత్వ ప్రత్యక్ష పాలన క్రింద వుండే ప్రాంతాల వివరాలను తెలిపే ఆరు షెడ్యూళ్ళు వున్నాయి.

పశ్చిమ బెంగాల్ బీహార్ రాష్ట్రాలనుగురించి బిల్లు ఉపోద్ఘాతంలో ఇలా వ్రాయబడివుంది:

“రెండు రాష్ట్రాలనువిలీనంచేసి ఒకే రాష్ట్రంగా ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఇంకా పరిశీలనలోనే వుంది గాబట్టి ఆ రెండురాష్ట్రాలకు సంబంధించిన సరిహద్దుమార్పులను బిల్లులో పొందుపరచలేదు. ఈరాష్ట్రాలను గురించి తీసుకోనబోయే నిర్ణయాన్ని అమలు పరచేందుకు కాలక్రమేణా వేరే ఒక బిల్లు ప్రవేశపెట్టబడుతుంది.”

సరిహద్దు కమిషన్ లకు అవకాశం

అవసరమైతే వివిధ రాష్ట్రాలమధ్య సరిహద్దులను సరిదిద్దడానికి భారత ప్రభుత్వం సరిహద్దు కమిషన్ లనునియమించగలదని కూడా బిల్లులో పేర్కొనబడింది.

హిమాచల ప్రదేశ్ ను గురించి బిల్లు ఉపోద్ఘాతంలో యిలా వ్రాయబడివుంది:

“ఎప్పటికైనా హిమాచల ప్రదేశ్ పంజాబులో అంతర్భాగం కావలసివున్నా ప్రస్తుతానికి అది కేంద్ర పాలిత ప్రాంతంగా వుంటుంది.”

పంజాబురాష్ట్రం విషయంలో యింతకుముందు జరిగిన నిర్ణయంలో కొద్దిమార్పు జరిగింది. హిస్సార్ జిల్లాలోని లోహార్ సబ్ తాలూకా పంజాబులోనే వుంచబడుతుంది. ఇంతకు ముందు దానిని రాజస్థాన్ లో కలపాలని ప్రతిపాదించబడింది.

ఆంధ్రకు మార్చాలని కమిషన్ సిఫార్సుచేసిన బళ్ళారిజిల్లాప్రాంతాలు మైసూరులోనే వుంచడానికి నిర్ణయించారు.

మండలాల నిర్మాణం

దేశం మొత్తంమీద అయిదు మండలాలుగా విభజించబడింది.

ఉత్తరమండలంలో పంజాబు, రాజస్థాన్, జమ్మూ-కాశ్మీర్, ఢిల్లీ, హిమాచలప్రదేశ్ వుంటాయి.

మధ్య మండలంలో ఉత్తరప్రదేశ్, మధ్య ప్రదేశ్ వుంటాయి. తూర్పు మండలంలో బీహార్, పశ్చిమ బెంగాల్, ఒరిస్సా, అస్సామ్, కేంద్ర పాలిత ప్రాంతాలైన మణిపూర్, త్రిపుర వుంటాయి.

పశ్చిమమండలంలో మహారాష్ట్ర, గుజరాత్, కేంద్ర పాలిత మైన బొంబాయి ఉంటాయి.

దక్షిణమండలంలో ఆంధ్ర-తెలంగాణా, మద్రాసు, మైసూరు, కేరళ రాష్ట్రాలు వుంటాయి.

ప్రతి మండలానికీ ఒక శాశ్వత కౌన్సిల్ వుంటుంది. ప్రతి కౌన్సిల్ కు ఒక శాశ్వత సెక్రటేరియట్ వుంటుంది. దీని కార్యాలయం కౌన్సిల్ నిర్ణయించిన ప్రదేశంలో నెలకొల్పబడుతుంది. ఈ మండలకౌన్సిల్ విధులు కేవలం సలహాపూర్వకంగా మాత్రమే వుంటాయి. ఆ మండలంలో వివిధ రాష్ట్రాలు కేంద్రప్రభుత్వం లేవనెత్తే ప్రతి సమస్యను చర్చించేందుకు ఆ కౌన్సిల్ కు హక్కుంటుంది.

మండల కౌన్సిల్ లో ఈ క్రింది వారు సభ్యులుగా వుంటారు:

(1) రాష్ట్రపతి నామినేట్ చేసే ఒక కేంద్ర మంత్రి, (2) ఆ మండలంలో వున్న రాష్ట్రాల ముఖ్య మంత్రులు, రాష్ట్రానికి ఇద్దరుచొప్పున ఆయా గవర్నర్లు అదనంగా నామినేట్ చేసే మంత్రులు, (3) కేంద్ర పాలిత ప్రాంతాలకు ఒకొక సభ్యుడు చొప్పున రాష్ట్రపతి నామినేట్ చేస్తారు. (4) తూర్పుమండలంలో కొండజాతుల వ్యవహారాలకు అస్సాం ప్రభుత్వానికి సలహాదారుగా వుండే వ్యక్తి సభ్యుడుగా వుంటాడు.

ప్రతి మండలకౌన్సిల్ కు కేంద్ర మంత్రి అధ్యక్షుడుగా వుంటాడు.

పాక్-భారత సరిహద్దులో కావలి పోలీసుల ఘర్షణ

రెండు రోజులు నిరంతరాయంగా సాగిన మీదట ఉభయ పక్షాల యుద్ధ విరమణ

అమృతసర్, మార్చి 15

భారత పశ్చిమసరిహద్దులో ఖేమ్కారన్ వద్ద మంగళవారం రాత్రినుంచి భారత, పాక్ గస్తీపోలీసుల మధ్య జరుగుతూవచ్చిన కాల్పులు నేటిరాత్రితో ముగిశాయి. ఉభయ గస్తీ దళనాయకులకూ యుద్ధవిరమణను గురించి నేటి రాత్రి ఒప్పందం కుదిరింది.

ఖేమ్కారన్ దగ్గరనున్న ముథియాన్వాలా ప్రాంతంలో పాక్ గస్తీ దళం మంగళవారంనాటి రాత్రి సరిహద్దును అతిక్రమించారు. అప్పుడు భారత గస్తీదళంవారు వారిని నిలవేయమగా కాల్పులు సాగించారు. వెంటనే భారత గస్తీదళంవారుకూడా సర్దుకొని ఎదురుకాల్పులు చేశారు.

అక్కడనుంచి ఈ కాల్పులు పట్టోకి, నూర్ మహమ్మద్, ఖేమ్కారన్, గుజ్జాల్, మియాంవాలా ఉత్తర్ మున్నగు కావలి స్థావరాలకు వ్యాపించాయి. ఇలాగ సరిహద్దులో మొత్తం పదిహేను మైళ్ళ పర్యంతం కల్లోలం వ్యాపించింది.

నిన్న రాత్రి నుంచి నేటి ఉదయం వరకు ఈ సరిహద్దు పొడుగునా కాల్పులు సాగుతూనే వున్నాయి. కాగా ఖేమ్కారన్ గుజ్జాల్ ల మధ్య మాత్రం నేటి మధ్యాహ్నం నుంచీ కాల్పులు ఆగిపోయాయి.

ఈ కాల్పులలో భారత కావలిదళాలకేమీ నష్టం వాటిల్లలేదు కాని పాకిస్తాన్ దళంలో ముగ్గురు మరణించినట్లు ధృవపడని వార్తలు వస్తున్నాయి.

ఈ సరిహద్దు సంఘటనను గురించి చౌదరీ రాంసింగ్ ఇలా వివరిస్తున్నారు.

సరిహద్దులో ఒక కాలిబాట విషయమై మార్చి 11 వ తేదీన పాక్ భారత సరిహద్దు పోలీసు అధికారులకు ఒక ఒప్పందం కుదిరింది. కాని ఆ తర్వాత ఈ కాలిబాటపై భారత పోలీసులు నడవరాదని పాక్ పోలీసులు అభ్యంతరం పెట్టారు.

పాక్ పోలీసులు భారత భూభాగంలోకి చొచ్చుకొనివచ్చి భారత పోలీసులపై కాల్పులు చేశారు. అప్పుడు భారత పోలీసులుకూడా ఎదురు కాల్పులు చేశారు. పాక్ పోలీసులు వెనకకు తిరిగిపోయారు. 13 వ తేదీ రాత్రి పాక్ పోలీసులు అదనపు బలగాలను తెచ్చుకొని మరతుపాకులతో కాల్పులు ప్రారంభించారు. క్రమంగా ఈ ఘర్షణ 15 మైళ్ళ పర్యంతం వ్యాపించింది.

లండన్ కు మాలెంకోవ్ ఆగమనం

లండన్, మార్చి 15

సోవియట్ విద్యుచ్ఛక్తి శాఖామంత్రి, ప్రథమ ఉపప్రధానీ అయిన జార్జి మాలెంకోవ్ ఈవేళ విమానంలో లండన్ చేరుకున్నారు. బ్రిటిష్ విద్యుచ్ఛక్తి శాఖామంత్రి ఆబ్రేజోన్స్, లండన్ లోని సోవియట్ రాయబారి జేకబ్ మాలిక్ మొదలయిన ప్రముఖులు విమానాశ్రయంలో ఆయనకు స్వాగత మిచ్చారు.

మాలెంకోవ్ తోపాటు మరొక పదముగ్గురు సోవియట్ అధికారులుకూడా వచ్చారు. వీరి రాకసందర్భంలో లండన్ విమానాశ్రయానికి ప్రజలు తండోపతండాలుగా వచ్చారు. ఈ సోవియట్ ప్రతినిధివర్గం బ్రిటన్ లో మూడు వారాలుంటుంది.

మలయా కమ్యూనిస్టులకు ప్రధాని విజ్ఞప్తి

కౌలాలంపూర్, మార్చి 15

మలయాలో సాయుధ పోరాటాన్ని విరమించవలసిందిగా ప్రధాని టెంకూ అబ్దుల్ రహమాన్ నేడు కమ్యూనిస్టులకు విజ్ఞప్తి చేశారు. హత్యలు మున్నగుఅమానుషకృత్యాలు చేయనివారికి “క్షమాదానం” ఇస్తామన్నారు. నిజాయితీగా పోరాటం విరమించిన కమ్యూనిస్టులకు తిరిగి తమ కుటుంబాలతో కలవడానికి, లేదా చైనాకు వెళ్లడానికి అవకాశంకలిగిస్తామన్నారు.

కరాచీకి మికోయాన్

పాక్ రిపబ్లిక్ దినోత్సవాల సందర్భంలో

మాస్కో, మార్చి 15

వచ్చేవారం జరిగే పాకిస్తాన్ రిపబ్లిక్ దినోత్సవాలకు, సోవియట్ ప్రథమ ఉపప్రధానిమికోయాన్ హాజరవుతారని నేటిరాత్రి ఇక్కడ ప్రకటించబడింది.

సోవియట్ ప్రధాని బుల్గానిన్, పాక్ ప్రధాని మహమ్మదలీకి ఒక లేఖ రాస్తూ పై విషయం తెలిపారు.

పాకిస్తాన్ కు ప్రముఖ సోవియట్ నాయకుడు రావడం ఇదే ప్రథమమవుతుంది. మికోయాన్ తోపాటు ఉజ్బెకిస్తాన్ సుప్రీం సోవియట్ అధ్యక్షుడు కోషిదావ్ కూడా కరాచీ వస్తారు.

విస్తీర్ణంతో నిమిత్తం లేకుండా ఈనాములన్నీ ఎస్టేట్లుగా నిర్వచన

ఈనాముల బిల్లుపై సిఫార్సుల సంఘం వారి నివేదికలో సూచన

(విశాలాంధ్ర విలేఖరి)

కర్నూలు, మార్చి 16

ఈనాం గ్రామంలో విస్తీర్ణంతో నిమిత్తం లేకుండా ఈనాం గ్రాంటుగా ఇవ్వబడిన భాగం అంతా ఎస్టేటు అవుతుందని ఈనాముల బిల్లు సిఫార్సులసంఘం వారు ఎస్టేటు పద నిర్వచనాన్ని సవరించారు.

ఈనాముల బిల్లుమీద సిఫార్సుల సంఘంవారు తమ నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. ఆ నివేదికను నేడు ప్రభుత్వం ఆంధ్ర గెజెట్ లో ప్రకటించింది. సిఫార్సుల సంఘంవారి సవరణలతోసహా ఈ బిల్లును ఈ సమావేశంలోనే శాసనసభకు సమర్పిస్తారు.

సంఘంవారు ఎస్టేటు పదనిర్వచనం విషయంలోనే చాలా చర్చలుజరిపి కొసకు పైవిధంగా నిర్ణయించారు.

చాకిరీ ఈనాముల మినహాయింపు

అన్నిరకాలవృత్తి ఈనాములను కూడా ఎస్టేటు పద నిర్వచనం నుండి మినహాయించారు.

ఈనాములు రద్దు అయ్యేవరకూ శిస్తు తగ్గింపుచట్టం అక్కడ అమలు జరగదు. ఈలోగా రైతులు ఈనాందార్లకు ప్రధానమైన సంపదలో అయిదవవంతు కాని, ప్రస్తుతపుశిస్తుగాని ఏది తక్కువైతే అది చెల్లించాలి. దేవాలయ విద్యాసంస్థల, ఈనాముల విషయంలో ఈశిస్తును వాటికే చెల్లించాలి.

ఈ బిల్లు ఏనాటినుంచి అమలు జరగాలన్న సమస్యమీద సిఫార్సుల సంఘంవారు చాలా చర్చలు జరిపి తుదకు ఈ బిల్లు 1948 జనవరి 7 వ తేదీ నుంచి అమల్లోకి రావాలని నిర్ణయించారు.

లోగడ భూములనుంచి వేదఖలు అయిన రైతులు తిరిగి భూమిని స్వాధీనం చేసుకోవాలనుకొంటే భూమి స్వాధీనంకోసం భూస్వామికి అతడు నోటీసివ్వాలి. పూర్వపు బిల్లులో నోటీసు తర్వాత సివిల్ కోర్టుకు వెళ్ళాలనివుంది, కాని ఇప్పుడు సిఫార్సుల సంఘంవారి సవరణ ప్రకారం రైతులు రెవెన్యూ కోర్టుకు వెళ్ళాలి. దానిమీద అప్పీలుకు ఎస్టేటు ట్రిబ్యునల్ కు వెళ్ళాలి.

భూమి స్వాధీనానికి నోటీసు ఇచ్చిన తర్వాత కోర్టుకు దరఖాస్తు పెట్టుకోనేగడువు లోగడ వారం రోజులే వుండేది. ఇప్పుడా గడువును 30 రోజులకు పెంచారు.

న్యూఢిల్లీ, మార్చి 15

గోవా జాతీయ కాంగ్రెసు నాయకుడు శ్రీ పీటర్ ఆల్వారిస్ నేడు ప్రధాని నెహ్రూను కలుసుకొని ఆయనతో గోవా వ్యవహారాలను గురించి చర్చించారు.

సభ్యత్వం ముగుస్తున్న 76 గురు రాజ్యసభ సభ్యులు

డాక్టర్ రాధాకృష్ణ వీడ్కోలు

న్యూఢిల్లీ, మార్చి 16

ఏప్రిల్ రెండవ తేదీతో సభ్యత్వం ముగుస్తున్న 76 గురు సభ్యులకు నేడు రాజ్యసభలో సభాధ్యక్షులు డాక్టర్ రాధాకృష్ణన్ వీడ్కోలిచ్చారు.

ఈ వేళతో రాజ్యసభ సమావేశాలు వాయిదా పడుతున్నాయి. మళ్ళీ సభవారు ఏప్రిల్ 16 న సమావేశమవుతారు.

సభ్యత్వం ముగుస్తున్నవారిలోచాలమంది మరల సభకు ఎన్నుకోబడి హాజరుకాగలరనే ఆశాభావాన్ని డాక్టర్ రాధాకృష్ణ వెలిబుచ్చారు. తక్కినవారి విషయంలో వారి సంబంధాన్ని సభవారు ఎల్లప్పుడూ గుర్తుంచుకోగలరన్నారు.

పార్లమెంటులో సభ్యత్వం లేకపోయినా వారు అనేక రంగాల్లో దేశానికి సేవచేసే అవకాశంవుండ గలదన్నారు.

ప్రధాని నెహ్రూకూడా 76 గురు సభ్యులకు తన వీడ్కోలు సందేశమిచ్చారు. దేశసేవ కేవలం పార్లమెంటురంగానికే పరిమితం కాదన్నారు. ప్రస్తుతం మన దేశానికి అన్నిరంగాల్లోకృషిచేసేవారు హెచ్చుమంది అవసరమన్నారు.

సభానాయకుడు పండిట్ పంత్ కూడా సభ్యులకు వీడ్కోలు నిస్తూ ఇంతవరకూ సభా కార్యక్రమ నిర్వహణలో వారిచ్చిన తోడ్పాటుకు కృతజ్ఞతను తెలియజేశారు.

22—3—56 నుండి తిరునాళ్ల సందర్భంలో మంగళగిరి - శ్రీ విజయలక్ష్మి టాకీస్ లో నాగుల చవితి విడుదల.

1956 మార్చి 17 శనివారం
మన్మథనామ సంవత్సర
ఫాల్గుణ శుద్ధ
పంచమి. ప॥ 3-2
కృత్తిక. తె॥ 2-3

విశాలాంధ్ర
శనివారం 17-3-56

రైల్వే కార్మికోద్యమ ఐక్యత

రెండుసంవత్సరాలుగా చీలివున్న భారత రైల్వేకార్మికోద్యమంలో తిరిగి ఐక్యతను నెలకొల్పడానికి ఉభయకార్మిక సంఘాల నాయకులు ఎట్టకేలకు ఒప్పందానికి రావడం కార్మిక శ్రేయోభిలాషులకు సంతోషం కలిగించకమానదు.

ప్రస్తుతం శ్రీ వాసవదా నాయకత్వంక్రింద ఒక సంస్థ, శ్రీ గురుస్వామి నాయకత్వాన మరొకసంస్థ వేర్వేరుగా పని చేస్తూండడంవల్ల, రైల్వే కార్మికోద్యమంలో చీలిక వచ్చింది. ఈ పరిస్థితిని ప్రభుత్వం ఉపయోగించుకొంటూంది. శ్రీవాసవదా నాయకత్వం క్రింద ఉన్న సంఘాన్ని మాత్రమే ప్రభుత్వం గుర్తిస్తోంది. ఈ విధానం అరిష్టదాయకమనీ, దాన్ని వొదులుకోవలసిందనీ ఇటీవల శ్రీ వి. వి. గిరి ప్రజాసభలో ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మొన్న 13 వ తేదీని రైల్వేమంత్రి శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి సమక్షంలో ఉభయసంఘాల నాయకులు సమావేశమై, యికముందు కార్మికుల తరఫున ఒకేసంస్థ పనిచేసేటట్లు చూడ్డానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందుకు శ్రీ జయప్రకాశ్ కృషికూడా తోడ్పడింది.

వీరు కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం, ప్రతి రైల్వే జోన్ లోను ఒకే కార్మిక సంస్థ ఉండాలి. అవన్నీ కేంద్ర సంస్థకు అధీన సంఘాలుగా పనిచేయాలి. వివిధ జోన్ల లో ఒక న్యాయమూర్తి పర్యవేక్షణ క్రింద కొత్త సభ్యుల్ని చేర్చుకొని, 1957 లో అఖిలభారత సంస్థకు ఎన్నికలు జరపాలి.

ఈలోగా వివిధ జోన్ల లోని సంఘాలు సంలీనమై తమ తమ నాయకుల్ని ఎన్నుకోవాలి. ఈ కార్యక్రమం పూర్తి అయినతర్వాత, అఖిలభారత సదస్సు 1956 అక్టోబరు లోగా జరుగుతుంది. ఈ ఒప్పందపు షరతులను అమలుజరపడానికి త్వరలో జాయింట్ కమిటీ లేర్పడతాయి.

పది లక్షలమంది రైల్వే కార్మికుల హక్కులకై పోరాడ ఏకైక రైల్వే కార్మిక సంస్థ కొరకు ఆందోళనచేస్తున్న కార్మికుల కిదొక విజయం. ఈ ఒప్పందాన్ని అమలు జరపడంలో వారు చూపే కార్యదక్షతపైన, సమైక్యతపైన చాలవరకు దాని ఫలితాలుఆధారపడివుంటాయి.

1953 లో రైల్వే మెన్స్ ఫెడరేషన్, జాతీయ రైల్వే కార్మిక సమాఖ్య ఒకే సంస్థగా ఏర్పడి పనిచేయాలనే నిర్ణయం అఖిలభారతస్థాయిలోనే అమలు జరిగింది. కానివివిధ జోన్లలోను, బ్రాంచిలలోను ఐక్యత సాధించడానికి జరిగినకృషి నామమాత్రమే. క్రిందిసంఘాలలోచీలికలుఅలాగేఉండిపోయాయి. అవి క్రమంగా పెద్దవై, అఖిలభారత స్థాయిలో నాయకుల మధ్య చీలికగా పరిణమించాయి. అట్టి స్థితి మళ్ళీ యేర్పడకుండాచూడవలసిన బాధ్యత రైల్వే కార్మికుల మీద ఉంది.

ప్రస్తుతం వివిధ జోన్లలో పనిచేస్తున్న అన్ని కార్మిక సంఘాల సహకారంతో యీ ఒప్పందాన్ని అమలుజరిపేందుకు కృషిజరగాలని కోరుతున్నాం. వివిధ జోన్లలో ఐక్యజాయింట్ కమిటీలతో ప్రారంభించి, వాటి ప్రాతిపదికపై1956 అక్టోబరులో జరిగే అఖిలభారత సదస్సులో ఏకైకరైల్వే కార్మిక ఫెడరేషన్ ఏర్పరచాలి. తరువాత అన్ని శాఖలలోనూసభ్యత్వంచేర్పించి క్రిందినుంచి సక్రమంగా ఎన్నికలు జరుపుటద్వారా ప్రజాస్వామిక సాంప్రదాయాలను ఏర్పరచుకోవాలని కోరుతున్నాం. ఇదొకటే రైల్వే కార్మికోద్యమ ఐక్యతను కాపాడటానికి మార్గమని నమ్ముతున్నాం.

బొంబాయిలో 400 మంది నర్సుల నిరాహార దీక్ష

బొంబాయి, మార్చి 15

నర్సులను గ్రామీణ ప్రాంతాలకు బదిలీచేసి తీరాలనే నిబంధనకు నిరసనగా బొంబాయిలోని ఐదు ఆస్పత్రులలో పనిచేస్తున్న నాలుగువందల మంది నర్సులు ఒకరోజు నిరాహారదీక్ష పూనారు.

వీరు నిరాహార దీక్షలో వుండి కూడా ఆస్పత్రులకు వచ్చి మామూలుగా పనిచేస్తున్నారు.

గ్రామాలలో వున్నప్పుడు తమకు రక్షణ, భద్రత, మంచిపని పరిస్థితులు ఉండగలవని హామీ ఇవ్వవలసిందిగా వీరు బొంబాయి ఆరోగ్యశాఖామంత్రి శ్రీ శాంతిలాల్ షా వద్దకురాయబారం వెళ్లి కోరారు. కాని ఆ రాయబారం ఫలించలేదు. అందుకని ఇప్పుడు వారు నిరాహారదీక్ష పూనారు.

శ్రీ శాంతిలాల్ షా పత్రికల వారితో ప్రసంగిస్తూ గ్రామసీమల్లో పని చేయడానికి కావలసినంతమంది దొరికేపక్షంలో మిగతావారిని తాము బలవంతం చేయబోమన్నారు. గ్రామాల్లో వారికి గృహవసతి సంపాదించడానికి ప్రయత్నిస్తామన్నారు.

కేంద్రంలో అధికారభాషగా ఇంగ్లీషుతోపాటు హిందీ

1960 కి ప్రవేశపెట్టబడుతుందని లోక్ సభలో విద్యాశాఖ ఉప మంత్రి ప్రకటన

న్యూఢిల్లీ, మార్చి 15

కేంద్ర పరిపాలనా వ్యవహారాల్లో ఇంగ్లీషుతోపాటు హిందీని కూడా ప్రవేశపెట్టడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదనీ, ఈ కార్యక్రమం 1960 తో పూర్తి అవుతుందని నేడు లోక్ సభలో విద్యాశాఖ ఉపమంత్రి డాక్టర్ శ్రీ మాలీ బడ్జెట్పై సాధారణచర్చ సందర్భంలో మాట్లాడుతూ తెలియజేశారు.

ఈవేళ బడ్జెట్పై జరిగిన చర్చ సందర్భంలో పార్టీ విభేదాలతో నిమిత్తంలేకుండా కొందరు కాంగ్రెసు ప్రముఖులు సహితం ప్రభుత్వాన్ని విమర్శించారు. ప్రథమ పంచవర్ష ప్రణాళిక అమలుజరిగిన ఫలితంగా ధనికులు మరింత ధనికులయ్యారనీ, పేదలు మరింత నిరుపేదలయ్యారని శ్రీ ఎ. కె. గోపాలన్ అన్న మాటలతో తాను ఏకీభవిస్తున్నానని శ్రీ యన్. వి. గాడ్గిల్ అన్నారు. అలాగే కొత్త పేకమిషన్ను నియమించాలన్న శ్రీ గోపాలన్ ప్రతిపాదనను కాంగ్రెస్ ప్రధానకార్యదర్శులలో ఒకరైన శ్రీ శ్రీమన్నారాయణ బలపరిచారు.

నేటి చర్చ సందర్భంలో విద్యాశాఖా ఉపమంత్రి డాక్టర్ శ్రీమాలీ జోక్యం కల్పించుకొని మాట్లాడుతూ శాస్త్రీయ, సాంకేతిక పరిపాలనా వ్యవహారాలకు సంబంధించిన పారిభాషిక పదాలను తన మంత్రిత్వశాఖ మన జాతీయఅవసరాల కనుగుణ్యంగా తయారుచేసిందని చెప్పారు. ఈ కార్యక్రమం త్వరితగతిని సాగుతున్నదనీ, 1960 కల్లా ఇంగ్లీషుతోపాటు హిందీ కేంద్ర ప్రభుత్వ వ్యవహారాలకు ప్రవేశపెట్టబడుతుందని తెలిపారు. ఆ తరువాత అయిదు సంవత్సరాల్లో పరిపాలనాభాషగా హిందీని అభివృద్ధి పరచడానికి అవకాశం కలుగుతుందనీ, రాజ్యాంగం ఆదేశానుసారం 1965 కు ఇంగ్లీషు స్థానే హిందీనే పూర్తిగా ప్రవేశపెట్టడానికి వీలు పడగలదని చెప్పారు.

శ్రీ తుల్సీదాస్ కిలాచంద్ (స్వతంత్ర - బొంబాయి) మాట్లాడుతూ "సుస్థిరమైనఆర్థికవిధానాన్ని" కేంద్రానికి ప్రసాదించినందుకు ఆర్థిక మంత్రిని అభినందించారు. అయితే ఈ బడ్జెట్ ప్రయివేటు రంగం తన విస్తృత బాధ్యతలను నిర్వహించడానికి తగిన ప్రోత్సాహం యివ్వడం లేదన్నారు. ఉత్పత్తిని పెంచాలనే ఆసక్తిని తగ్గించేవిధంగా మన విధానాలు వుండరాదన్నారు. కొద్దిమంది వ్యక్తులచేతుల్లో ఆర్థికసంపద కేంద్రీకరించకుండా చేదామనే పేరుతో ప్రభుత్వం హెచ్చుఅధికారాలను తీసుకొంటూ పరిశ్రమలను ఒకదాని తరువాత మరొకదానిని జాతీయం చేయడానికి పూనుకొన్నదని విమర్శించారు.

గాడ్గిల్ ప్రసంగం

శ్రీ ఎన్.వి. గాడ్గిల్ (కాంగ్రెసు)- ప్రసంగిస్తూ దేశంలోని నిరుద్యోగాన్ని త్వరిత గతిని కుదుమట్టించుకోవాలన్నారు. అందరికీ ఉపాధులనుకల్పించడమే మన ఆర్థిక విధానాల ఆశయమై వుండాలని ఆయన స్పష్టం చేశారు. ప్రథమ పంచవర్ష ప్రణాళిక కాలంలోపారిశ్రామిక, వ్యావసాయిక రంగాల్లో ఉత్పత్తి హెచ్చినమాట నిజమేనన్నారు. అయితే ధనికులు మరింతగా ధనికులయ్యారనీ, పేదలు నిరుపేదలయ్యారని చెప్పారు.

అందువలన కేవలం ఉత్పత్తిని పెంచడంపైనే మన దృష్టిని కేంద్రీకరించకుండా ఉత్పత్తి అయిన సంపద సరిగా పంపిణీ జరిగేవిషయంపైకూడా శ్రద్ధ వహించవలసి వుంటుంది.

ద్వితీయ పంచవర్ష ప్రణాళిక పూర్తి అయ్యేటప్పటికి పబ్లిక్ రంగం బాగా విస్తరించాలన్నారు. ప్రయివేటురంగం మన ప్రణాళికకు అనుగుణ్యంగా కొన్ని పరిమితులలోనే వుండేటట్లు చూడాలన్నారు.

శ్రీ షియో నారాయణఫోతేదార్ (కాంగ్రెసు- కాశ్మీర్) మాట్లాడుతూ ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులదృష్ట్యా కాశ్మీర్ ప్రజల అభిమతానుసారం జమ్మూ - కాశ్మీర్ భారతదేశ అంతర్భాగంగా అయ్యేటట్లు చూడటం భారత ప్రభుత్వ, భారత పార్లమెంటు విధి అని విజ్ఞప్తి చేశారు.

శ్రీ హరీతిలాల్ అగర్వాల్ (కాంగ్రెసు - ఉత్తర ప్రదేశ్) ప్రభుత్వంచేసే ఖర్చులన్నింటిపైనా పార్లమెంటు కమిటీల అజమాయిషీ వుండాలన్నారు.

శ్రీ యన్. శ్రీ కంఠన్నాయర్ (ఆర్. యస్. పి- కేరళ) ఈ బడ్జెట్ ఎన్నికలనుద్దేశించి తయారుచేసినట్టుగా ఉన్నదన్నారు. పరోక్షపు పన్నులు సామాన్య ప్రజలకు చాల భారంగా తయారవుతాయని ఆయన హెచ్చరిక చేశారు.

పాకిస్థాన్ అమెరికాతోకూడి సామ్రాజ్యవాదదేశాలతో మరెంతసన్నిహితమవుతున్నదృష్ట్యా మన రక్షణ ఏర్పాట్లను జాగ్రత్త చేసుకోవడం మంచిదని సూచించారు.

శ్రీమతి తారకేశ్వరి సిన్హా (కాం- బీహార్) లోటుబడ్జెటు విధానంవలన ధరలు పెరిగేప్రమాదం గలదని, అందువలన చాల చిక్కులు కలుగుతాయనే సందేహం తనకు గలదన్నారు. అందువలన వాడకం వస్తువుల ఉత్పత్తి కనీసను నాటికి అయిదు వంతులైనా హెచ్చేటట్లు చూడాలన్నారు.

ఆర్థికశాఖ ఉపమంత్రి శ్రీ బి. ఆర్. భగత్ చర్చలో జోక్యంకల్పించుకుని ప్రసంగిస్తూ రిజిస్టర్డుపోస్టుద్వారా పంపే పుస్తకాల ప్యాకెట్లకు ఏమయినా సౌకర్యాలు కల్గించవచ్చునేమో పరిశీలించేందుకు రవాణా మంత్రిత్వ శాఖ ఒక కమిటీని అప్పుడే నియమించినదని తెలియజేశారు. ద్వితీయ పంచవర్ష ప్రణాళికా కాలంలో పరిశ్రమలను వికేంద్రీకరించడానికి యత్నం జరుగుతుందని హామీ యిచ్చారు.

శ్రీ ఝులాసిన్హా (కాంగ్రెస్ - బీహార్) ధనవంతుల ఆదాయాన్ని తగ్గించే కార్యక్రమాన్ని మరింత త్వరితం చేయాలన్నారు.

శ్రీ బి. పోకర్ (ముస్లింలీగు - మద్రాసు) ద్వితీయ ప్రణాళికలో మద్రాసురాష్ట్రంపట్ల సవతి తల్లి ప్రేమను చూపారని ఆరోపించారు.

సంజీవరెడ్డిగారిపై ఓబులరెడ్డిగారి విసుర్లు

ప్రమాణస్వీకారానంతరం లచ్చన్నగారి విందులో వ్యవసాయమంత్రి తొలిప్రసంగం

[విశాలాంధ్ర విలేఖరి]

కర్నూలు, మార్చి 16

"సంజీవరెడ్డిగారిని నేనూ, తిమ్మారెడ్డిగారూ ద్వేషించినంతగా మరెవ్వరూ ద్వేషించివుండరు. కాని తిమ్మారెడ్డిగారు మానుంచి విడిపోయిన తర్వాత సంజీవరెడ్డిగారికి ఆయనకు బాగా కలిసింది. వారిద్దరూ బంగారం, వెలిగారంలాగ అతుక్కొనిపోయారు" అని కందుల ఓబులరెడ్డిగారు నిన్నరాత్రి ఆయన గౌరవార్థం మంత్రి లచ్చన్నగారు ఇచ్చిన విందు సందర్భంలో ప్రసంగిస్తూ అన్నారు.

మంత్రి లచ్చన్నగారిచ్చిన విందుకు ఉప ముఖ్యమంత్రి సంజీవరెడ్డిగారు ఇతర మంత్రులూ ఉన్నతోద్యోగులూ వచ్చారు. గుంటూరు, కృష్ణా జిల్లాలలోని కృషీకార్ లోక్ పార్టీ ముఖ్యులందరూ ఈ విందుకు హాజరయ్యారు.

ఆ విందు సందర్భంలో శ్రీ ఓబులరెడ్డిగారు ప్రసంగిస్తూ ఇలా అన్నారు.

మంత్రులుగా వుండడానికి అర్హత గలవారందరికీ మంత్రిపదవికి అవకాశం ఇవ్వడం మంచిది. అట్టి అర్హతకలవారు చాలామంది వున్నారు. అప్పుడే మంత్రివర్గం సుస్థిరమై మనగలుగుతుంది. అలాంటి అర్హతగల వారిలో తిమ్మారెడ్డిగారొకరు. వారు ఈ మంత్రివర్గంలోలేనిదే నాకేమీ సంతోషంగా లేదు. ఉపమంత్రులను కూడా నియమించి వారికి మంత్రులుగా తరిఫీదు ఇవ్వాలి.

సంజీవరెడ్డిగారికీ నాకూ ఒక కోరిక వుంది. ఆయన ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసుకమిటీ సభ్యుడు కావడం, దానితోపాటు ఆంధ్ర కాంగ్రెసు సంయుక్త కార్యదర్శి కావడం ఒకసారే జరిగింది. అప్పుడు నేనుఆంధ్రకాంగ్రెస్ కమిటీ పొంతకే పోలేదు. సంజీవరెడ్డిగారికి ఆ పదవిపోయింది. ఆంధ్ర కాంగ్రెసులోకి నేను వెళ్ళాను. నేను కాంగ్రెసు కార్యదర్శినే అయ్యాను. నేనక్కడ ఉన్నాన్నాళ్లూ ఆయనలేరు. నేను పోయాను. ఆయన కాంగ్రెసు అధ్యక్షులయ్యారు.

తర్వాత సంజీవరెడ్డిగారు ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రి అయారు. అప్పుడు నేను లేను. ఆయన పడిపోయారు. నేను శాసన సభ్యుణ్ణి అయ్యాను. ఇప్పుడు మంత్రివర్గంలోకి వచ్చాను. ఇక ఇప్పుడు ఆయనకు ప్రమోషన్ అవుతుందో నాకు ప్రమోషన్ అవుతుందో చూడాలి.

విశాలాంధ్ర ఏర్పడుతోంది. నాయకత్వంకోసం ఇప్పుడు పోరులాడ్డం మంచిదికాదని హెచ్చరిస్తున్నాను. అసలు విశాలాంధ్ర ఎందుకు? నామట్టుకు నేను రెండు తెలుగు రాష్ట్రాలుండాలంటాను. తప్పయితే క్షమించండి.

మన మంత్రివర్గం తెలంగాణాను తమలో చేర్చుకొనడానికి తాపత్రయం బడేబదులు ఇతర రాష్ట్రాలలోని ఆంధ్రుల విముక్తికి కృషిచేసివుంటే బాగుండేది. ఈ విషయంలో మంత్రివర్గం తప్పు చేసిందనే నేను అభిప్రాయపడుతున్నాను.

నేను ఈవేళ ప్రమాణ స్వీకారం చేస్తూ సంతకం పెట్టినప్పుడు నన్ను నేనే నమ్మలేకపోయాను. నా సంతకాన్ని నేనే నమ్మలేకపోయాను. నేను మంత్రినైనానా అన్నసందేహం నన్ను విడవలేదు. నేను ఆర్నెల్ల మంత్రినైనాను. నడమంత్రపు మంత్రినైనాను.

ఇదుగో మంత్రి నియామకం జరుగుతోంది అదుగో ప్రమాణం జరుగుతుంది అని సంవత్సరం నుంచీ వార్తలు వస్తున్నాయి. కాని అలా జరగలేదు. ఆంధ్రదేశ మందంతటా నిరాశ అలముకొంది. నేను మంత్రినయ్యానని స్వయంగా వచ్చి చెప్తేతప్ప రేడియోలో వార్త నమ్మవద్దని నా మిత్రులకు చెప్పాను.

నన్ను మంత్రిని కానీకుండా వారు అడ్డుపడ్డారు- వీరు అడ్డుపడ్డారు అని ఎవరినీ నేను నిందించదలుచుకోనలేదు. ఏదో తాత్కాలికోద్రేకంలో వారు వీరు కారణమని పేలివుండవచ్చును.

కాని అన్నీ దైవకృతమే నన్న మనస్తత్వం నాది. సంజీవరెడ్డిగారిని నేనూ, తిమ్మారెడ్డిగారూ ద్వేషించినంతగా మరెవరూ ద్వేషించి వుండరు. తిమ్మారెడ్డిగారు మానుంచి విడిపోయిన తర్వాత ఆయనకూ, సంజీవరెడ్డిగారికీ బాగా అతుక్కొని పోయింది. వారిప్పుడు బంగారం వెలిగారంలా వున్నారు. అదంతా దైవవిధి.

నేను మంత్రి నయ్యాను కాని ఒక డెమాన్స్ట్రేటర్ని కూడా నియమించే అధికారం నాకులేదు. నాకు అయిదుగురు నౌకర్లున్నారు. కాని వారిని నియమించే అధికారం మాత్రం నాకులేదు. నేనేం చేయాలో నా సంగతే నాకు తెలియని స్థితిలో వున్నాను.

ఇప్పుడింకా తెరబైటనే వున్నాను. రేపు తెరలోకి వెళ్ళి చూడాలి. ఈ కూజంతంలో ఎంత రామాయణం వుందో చూస్తాను.

నామీద గురుతర బాధ్యతలు పడ్డాయి. ఆ బాధ్యతా నిర్వహణకు నేను తగిన వాణ్ణికాను.

తిమ్మారెడ్డిగారు వ్యవసాయ మంత్రిగా పనిచేశారు. నేను కూడా ఇప్పుడు వ్యవసాయమంత్రిగానే వున్నాను. కనీసం తిమ్మారెడ్డిగారి స్థాయికైనా రాగలననే నా నమ్మకం.

గోగినేనివారి కొత్త సంస్థ

భారతీయ గ్రామోద్యోగ సమ్మేళనం

న్యూఢిల్లీ, మార్చి 15

గ్రామీణ చేతివృత్తులవారితో భారతీయ గ్రామోద్యోగ సమ్మేళనం అనే పేరుతో రంగాగారు కొత్తసంస్థనొకదాన్ని స్థాపించారు. ఈ సంస్థకు ఆయనే అధ్యక్షులు.

ద్వితీయ ప్రణాళికను అమలుజరపడానికి గ్రామీణ చేతివృత్తులవారి సహకారాన్ని సాధించడమే ఈసంస్థ తక్షణాశయం అని ఆయన పత్రికలవారి కెరుకపరచారు.

అఖిల భారత వ్యాప్తిపొందడం కోసమని రంగాగారు ఈ సంస్థకు కూడా హిందీ పేరే పెట్టారు. గ్రామోద్యోగులంటే మనకు మునసబులూ కరణాలూ జ్ఞాపకం వస్తారు. కాని హిందీలో గ్రామోద్యోగులంటే గ్రామీణ చేతివృత్తులవారు అని అర్థం.

ఈ కొత్త సంస్థ ఆశయాదర్శాలను రంగాగారిలా వివరిస్తున్నారు.

గ్రామీణ చేతి వృత్తులవారి ఆర్థిక పరిస్థితిని చక్కబరచడంకోసం అఖిల భారత ఖాదీ కుటీర పరిశ్రమలసంఘం, అఖిలభారత చేతి వృత్తుల సంఘాలకు ఈ సంస్థ తోడ్పడుతుంది.

చేతివృత్తులవారికిది సరుకుల తయారీలో, వాటిఅమ్మకంలో, రవాణాలో తోడ్పడుతుంది. అఖిలభారత ఖాదీ సంఘానికీ, చేనేత సంఘానికీ సంధాన కర్తగా పనిచేస్తుంది.

చేనేతపనివారి కాంగ్రెసు, గానుగ పనివారి సమ్మేళనం తోళ్ల కార్మికుల సమ్మేళనం, లోహకార్మికుల సమ్మేళనం ఈ కొత్తసంస్థకు అప్పుడే అనుబంధంగా చేరాయి. ఈ కొత్తసంస్థ పాలకవర్గంలో 50 మంది పార్లమెంటు సభ్యులుకూడా చేరారట.

అఖిలభారత గ్రామోద్యోగ సమ్మేళన ప్రథమ సదస్సు ఢిల్లీలో ఏప్రిల్ 16 వ తేదీన జరుగుతుంది. దీనికి కేంద్ర ఉత్పత్తి శాఖమంత్రి శ్రీ కె. సి. రెడ్డిగారు ప్రారంభోత్సవం చేస్తారు. అంతకు తొలిరోజున అఖిలభారత చేనేత కాంగ్రెసు సదస్సుకు కేంద్ర వాణిజ్య మంత్రి కృష్ణమాచారిగారు ప్రారంభోత్సవం చేస్తారు.

* * *

కరాచీ నౌకాశ్రయంలో తమకోసం ఆరు నౌకలను నిర్మించవలసిందిగా గోవా పోర్చుగీస్ ప్రభుత్వం పాకిస్తాన్ను కోరింది.

మారణాయుధాలన్నింటినీ తలదన్నే బ్రహ్మాస్త్రం

అమెరికాకన్న సోవియట్దే పైచేయి

న్యూయార్క్, మార్చి 15

ఇంతవరకూ తెలిసిన వాటన్నింటికన్నా వినాశకరమైన ఆయుధాన్ని కనిపెట్టడంలో సోవియట్ యూనియన్ అమెరికాకన్న ముందున్నట్లు అమెరికన్ సైనిక నిపుణుడు హాన్సన్ బాల్డ్విన్ తెలియ జేశారు.

సైనికనిపుణుడుగా బాల్డ్విన్ కు అమెరికాలో గొప్ప ఖ్యాతివుంది. ఈయన "కొల్లియర్స్" పత్రికలో ఒక వ్యాసంవ్రాస్తూ, ఈ ఆయుధం అభివృద్ధి అయినపుడు, ప్రపంచంలో ప్రతి నగరమూ నాశనమయ్యేప్రమాదం ఏర్పడుతుందన్నారు. ఈ ఆయుధం గంటకు 16 వేల మైళ్ళ చొప్పున ప్రయాణంచేస్తూ, ఐదువేల మైళ్ళ దూరంలోవున్న నగరంపై హైడ్రోజన్ బాంబును జారవిడువగలదన్నారు.

ఈ ఆయుధాన్ని అమెరికామీద ప్రయోగించినట్లయితే, కోటినుంచి ఐదుకోట్లమధ్య జనం చావడమో, వికలాంగులు కావడమో జరుగుతుంది. అమెరికా పారిశ్రామిక శక్తిలో మూడవ వంతు నాశనం కావచ్చు. అమెరికాలో కొన్ని ప్రాంతాలు అణుధార్మిక ఎడారులుగా మారిపోవచ్చు.

ఇటువంటి మారణాయుధాలు కొన్నింటిలో అమెరికా ముందున్నప్పటికీ, ఈ అత్యంత శక్తివంతమైన ఆయుధం విషయంలో మాత్రం సోవియట్ బాగా ముందున్నట్లు బాల్డ్విన్ వెల్లడించారు.

దీనిని ముందుగా కనిపెట్టే రాడార్ సాధనాలు కూడా ప్రస్తుతం ఏమీ లేవన్నారు.

ఈ ఆయుధం సోవియట్ చేతుల్లోవుండడంవల్ల, దాని "రాజకీయ నైతిక దాడికి" బలం కలుగుతుందని ఇక్కడ నిపుణులు భావిస్తున్నారు. అందుచేత, తానుకూడా ఈ ఆయుధం తయారుచేయడానికి అమెరికా శాయశక్తులా కృషిచేస్తున్నది. అమెరికాలోని అత్యున్నత శాస్త్రవేత్తలనందరినీ ప్రభుత్వం ఇందుకు సమీకరించింది.

రైల్వే సంఘాల లీనీకరణ

గిరిగారి హర్షం

న్యూఢిల్లీ, మార్చి 15

రైల్వే కార్మిక సంఘాలను రెండింటినీ కలిపివేయాలని నాయకులు చేసుకొన్న ఒప్పందానికి మాజీ కేంద్ర కార్మికమంత్రి గిరిగారు నేడుస్వాగతం ఇచ్చారు.

జీవితభీమావ్యాపారాన్ని జాతీయం చేసే బిల్లు

పార్లమెంటు ఉభయ సభల ఆమోదం

న్యూఢిల్లీ, మార్చి 15

జీవితభీమా కంపెనీల మేనేజిమెంటును ప్రభుత్వపరం చేస్తూ ఇంతకుముందు జారీచేయబడ్డ ఆర్డినెన్సుస్థానే ప్రవేశపెట్టిన బిల్లును నేడు రాజ్యసభవారు ఎలాంటి మార్పులు లేకుండా ఆమోదించారు.

ఈబిల్లు ఇంతకుముందే లోక్ సభలో ఆమోదించబడింది.

చర్చకు సమాధానం ఇచ్చేసందర్భంలో రెవెన్యూ సివిల్ ఖర్చులశాఖా మంత్రి శ్రీ యం. సి. షా బిల్లునుండి కొందరు కోరినవిధంగా కో-ఆపరేటివ్ ఇన్సూరెన్సు సొసైటీలను మినహాయించే వుద్దేశ్యం ప్రభుత్వానికి ఏమాత్రంలేదని స్పష్టంచేశారు.

చర్చ సందర్భంలో కమ్యూనిస్టు నాయకుడు శ్రీ భూపేష్గుప్త ప్రసంగిస్తూ బిల్లును పూర్తిగా బలపరిచారు. ప్రస్తుతంఇన్సూరెన్సు వ్యాపారమంతా హెచ్చు డబ్బుగల కొద్దిమందిచేతుల్లో వున్నదని పేర్కొన్నారు.

జీవిత భీమాతోపాటు జనరల్ భీమా వ్యాపారాన్నికూడా జాతీయం చేయడం అవసరమని శ్రీ భూపేష్ గుప్త బిల్లు మూడో పఠనం సందర్భంలో మాట్లాడుతూ అన్నారు.

జనరల్ భీమా వ్యాపారంలో విదేశీయుల ఆధిపత్యం హెచ్చుగావున్నదనీ, జాతీయంచేయడం ద్వారా వారి పీడను వదలించుకోవచ్చునని ఆయన అన్నారు. అదిగాక, జనరల్ భీమా వ్యాపారాన్ని జాతిపరం చేయడంవలన ప్రభుత్వానికి ఎంతో ఆదాయంరాగలదని ఆయనన్నారు.

ఒకవైపున భీమా కంపెనీలు విపరీతమైన ఖర్చులనుపెట్టి ప్రజాద్రవ్యాన్ని దుర్వినియోగం చేస్తున్నాయని ప్రభుత్వంచెపుతూనే మరొకవైపునఇప్పుడు కంపెనీలకు సంరక్షకులుగా నియమించబడుతున్న ఉద్యోగులకు విపరీతమైన జీతాలను చెల్లించబోతున్నదని శ్రీ భూపేష్గుప్త విమర్శించారు. కొన్ని చోట్ల ఇదివరకు ఎవరిపై ఆరోపణలు వచ్చాయో వారినే కంపెనీల సంరక్షకులుగా నియమించడం జరుగుతున్నదన్నారు. మరికొన్ని చోట్ల-ఉదాహరణకు కలకత్తాలో భీమా వ్యాపారంలో ఎలాంటి అనుభవంలేని కొందరిని సంరక్షకులుగా నియమించుతున్నారన్నారు. ఇంతకంటే ఇంతకుముందు భీమా కంపెనీలలో కడు సమర్థతతో పనిచేసిన చిన్న ఉద్యోగులను సంరక్షకులుగా నియమించడ మవసరమని విజ్ఞప్తి చేశారు.

తమ దేశాలనుండి పెట్టుబడిని తీసుకొనిరాని విదేశ భీమా కంపెనీలవారికి ఎలాంటి నష్టపరిహారం చెల్లించరాదని శ్రీ భూపేష్గుప్త అన్నారు.

డాక్టర్ ఆర్. కె. ముఖర్జీ (నామినేటెడ్) ఇంత తొందరపడి జీవిత భీమా వ్యాపారాన్ని జాతీయం చేయడం ప్రభుత్వానికి తగినపని కాదని విమర్శించారు.

శ్రీ యమ్. గోవిందరెడ్డి (కాంగ్రెసు-మైసూరు) బిల్లును బలపర్చడమే కాక భీమా వ్యాపారాన్నంతటినీ జాతిపరం చేయాలని కోరారు.

శ్రీ యస్. పి. జెయిన్ (కాం- బొంబాయి) బిల్లును వ్యతిరేకిస్తూ ప్రయివేటు రంగంలో అవకతవకలు నిజంగా జరుగుతున్నదీ లేనిదీ విచారించేందుకు పార్లమెంటు ఉభయ సభల్లోని సభ్యులతోకూడిన ఒక కమిటీని నియమించాలని కోరారు.

శ్రీ రామచంద్ గుప్త (కాం- యు. పి.) ఈ చర్యను ప్రభుత్వ ఇంతకుముందే తీసుకొని వుండవలసిందన్నారు.

శ్రీ హెచ్. సి. దాసప్ప (కాంగ్రెసు-మైసూరు) మన ప్రభుత్వం విధానం పరిశ్రమలను జాతీయం చేయటమే అయినప్పటికీ తొందరపాటు పనికిరాదన్నారు.

చర్చకు మంత్రి శ్రీ యమ్. సి. షా జవాబు చెపుతూ, జీవిత భీమాను జాతీయం చేయాలన్న నిర్ణయం తొందరపాటుగా తీసుకొన్నది కాదన్నారు. మన జాతి నిల్వలన్నింటినీ సమీకరించి సద్వినియోగం చేసే ఉద్దేశ్యంతోనే జీవిత భీమాను జాతీయం చేయడానికి ప్రభుత్వం పూనుకొన్నదని తెలిపారు.

మంత్రి ప్రసంగం అనంతరం బిల్లును సభవారు ఆమోదించారు.

మాటూరుపేట హత్యకేసు

సుప్రీంకోర్టులో అప్పీలు తిరస్కృతి

న్యూఢిల్లీ, మార్చి 15

మాటూరుపేట హత్యకేసు సందర్భంలో యావజ్జీవ శిక్ష పడిన శ్రీ వేమిరెడ్డి సత్యనారాయణరెడ్డి ప్రభృతులు చేసుకొన్న అప్పీలును సుప్రీంకోర్టువారు తిరస్కరించారు.

మాటూరుపేటలో వెంకటకృష్ణశాస్త్రిఅనే కాంగ్రెసువాది 1949 లో హతుడయ్యాడు.

ఆ సందర్భంలో కమ్యూనిస్టులైన శ్రీ వేమిరెడ్డి సత్యనారాయణరెడ్డి, చిప్పగిరి గురవయ్య, కేమ ముత్యాలు, సుంపం చుక్కయ్యగార్లమీదా మరి ఇద్దరిమీదా పోలీసులు అభియోగం మోపారు. వరంగల్లు సెషన్జడ్జి యీ అభియోగాన్ని విచారించి వెంకటకృష్ణశాస్త్రి హత్యకు కారకులు వీరేనని నిర్ణయించారు. ఇద్దర్ని విడిచిపెట్టి సత్యనారాయణరెడ్డి, గురవయ్య, ముత్యాలు, చుక్కయ్యగార్లకు మరణశిక్ష విధించారు.

ఈతీర్పుమీదవారు హైద్రాబాదు హైకోర్టుకు అప్పీలు చేసుకొనగా ఇద్దరు న్యాయమూర్తులమధ్య అభిప్రాయభేదాలు వచ్చాయి. అందుకని అభియోగాన్ని మూడవ న్యాయమూర్తికి నివేదించారు. మూడవ న్యాయమూర్తి వీరి నేరాన్ని ధృవీకరించారు. కాగా మరణశిక్షను యావజ్జీవ శిక్షగా మార్చారు. అంతట వారు సుప్రీంకోర్టుకు అప్పీలుచేసుకొన్నారు.

సుప్రీంకోర్టులో న్యాయమూర్తి శ్రీ చంద్రశేఖర అయ్యర్ ఈ అప్పీలును తిరస్కరిస్తూ హైద్రాబాదు హైకోర్టు న్యాయమూర్తులలో అభిప్రాయభేదాలు రావడంవల్ల మరణశిక్ష తప్పి యావజ్జీవ శిక్ష పడినందుకు దోషులు సంతోషించవలసివుంటుందని వ్యాఖ్యానించారు.

నెహ్రూ అమెరికా సందర్శిస్తారా?

జూన్లో వెళ్ళవచ్చునని ఊహాగానం

న్యూయార్క్, మార్చి 15

ఐసెన్హోవర్తో చర్చలకై ప్రధాని నెహ్రూ జూన్ రెండవ వారంలో వాషింగ్టన్ రావచ్చునని ఐ. రా. స. లో దౌత్యవర్గాలవారు నేడన్నారు.

ఢిల్లీలో డల్లెస్ నెహ్రూకు ఆహ్వానం అందజేశారన్న వార్తను నిన్న వైట్హౌస్ ప్రకటించింది. దీని అర్థం, భారతప్రధాని ఈ ఆహ్వానాన్ని అంగీకరిస్తాడని వైట్హౌస్ నమ్ముతున్నదని వీరన్నారు. నవంబరులోఅమెరికా అధ్యక్షుని ఎన్నికలు జరగడానికిముందే నెహ్రూ రావచ్చునంటున్నారు. వాషింగ్టన్లో ఐసెన్హోవర్తో చర్చలు జరిపి నెహ్రూ వెళ్ళిపోతాడని భావించబడుతున్నది.

* * *

గాజాసరిహద్దు ప్రాంతంలో బుధవారంనాడు మళ్ళీ ఈజిప్ట్, ఇజ్రాయిల్ సేనలకు సంఘర్షణ జరిగింది.

క్రీడారంగం

కబాడీ ఆటగాళ్లకు మద్రాసులో శిక్షణ

విజయవాడ, మార్చి 16

అఖిలభారత కబాడీసంఘం ఆధ్వర్యాన మద్రాసు వై. యం. సి. ఏ. కళాశాలలో మార్చి 19 నుండి 28 వ తేదీవరకు కబాడీశిక్షణకేంద్రం నడుపుతారు. ఆంధ్ర, మైసూరు, మద్రాసు రాష్ట్రాలకుచెందిన కబాడీఆటగాళ్ళకు శిక్షణ యిస్తారు. పదిమంది ఆంధ్ర ఆటగాళ్ళు శిక్షణపొందడానికి అవకాశముంది. శిక్ష :ణపొందదలచినవారు 18 వ తేదీనాటికి ఈ క్రింది చిరునామాకు దరఖాస్తు పెట్టుకోవాలి. శ్రీ వి. సూర్యప్రకాశరావు, గౌరవ కార్యదర్శి ఆంధ్ర కబాడీ సంఘం, ఆంధ్రలయోలాకళాశాల,విజయవాడ.

రాష్ట్రపతి పాలన తప్పించడానికి మార్గం

అఖిలపక్ష ప్రభుత్వ నిర్మాణమేనని తిరుకొచ్చి కాంగ్రెసు ప్రముఖుని సూచన

తిరువేంద్రం, మార్చి 15

తిరుకొచ్చిలో రాష్ట్రపతిపాలనను తప్పించడానికి మార్గం అఖిలపక్ష ప్రభుత్వం ఏర్పరచడమేనని శాసన సభ ప్రముఖ కాంగ్రెస్ సభ్యుడు శ్రీ విగనర్ నేడు ప్రకటించారు. తిరుగుబాటుదార్లకు, కాంగ్రెస్ పార్టీకి మధ్య ఒక బాసగనందున అన్ని పక్షాలతో మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయడమే మార్గమన్నారు. ఈమంత్రి వర్గంలో కాంగ్రెస్‌నుండి ఇద్దరూ, కమ్యూనిస్టు, ప్ర. సో. పార్టీ, రివల్యూషనరీ సోషలిస్టుపార్టీ, తమిళనాడు కాంగ్రెసులనుండి ఒక్కొక్కర్లు ఉండవచ్చుననీ, వివాదాస్పద విషయాలను వదలి అభివృద్ధి ప్రణాళికలు, ఆర్థిక పునర్నిర్మాణ సమస్యలను మాత్రమే ఈ మంత్రివర్గం చూడాలనీ ఆయన అన్నారు.

బజారు ధరలు

విజయవాడ, మార్చి 16
(మధ్యాహ్నం గం. 1 వరకు)

బంగారం ధరలు

మేలిమి పొట్లా		105	0	0
మూసా		104	0	0
నవరసు		67	0	0
వెండి 100 తులములు		180	0	0
1 తులము		1	13	6

ధాన్యం ధరలు

24 నెంబరు		24	0	0
వరికోసన్నాలు		22	0	0
12 నెంబరు		21	12	0
అక్కుళ్ళు		21	12	0
కుసుమ		21	10	0
కోణామణి		21	10	0

బియ్యం ధరలు

24 నెంబరు		54	0	0
వంకోసన్నాలు		51	0	0
12 నెంబరు		49	8	0
అక్కుళ్ళు		49	8	0
కుసుమ		49	8	0
కోణామణి		49	8	0

అపరాల ధరలు

మినుములు 240శేరులకు		55	0	0
కందులు		36	0	0
నల్లపెసలు (మాగాణి)	37,	40	0	0
పచ్చపెసలు 230 శే॥		43	0	0
పచ్చపెసలు (మెట్టవి)		42	0	0
సెనగలు (దేశవాళీ)		37	8	0
సెనగలు (పంజాబు)		35	0	0
ధనియాలు 90శేరులు		31	8	0
ఉలవలు		31	0	0
ఆముదాలు		31	0	0
పంచదార (ఉయ్యూరు)		88	5	0
బెల్లం మణుగు	360	4	4	0
మిర్చి ,,	18/-	24	0	0
నీరుల్లి ,,		1	8	6
వెల్లుల్లి ,,		6	12	0
చింతపండు	600	78	0	
నువ్వుల నూనె (మణుగు)		20	0	0
కొబ్బరినూనె డబ్బా		24	4	0
వేరుసెనగపప్పు 177 శే॥		55	8	0
,, నూనె మణుగు		15	8	0
,, కేక్ 160 శే॥		14	2	0
,, మడ్డిపిండి 160 శే॥		15	8	0
కొబ్బరికాయలు 1,000		145	0	0
పసుపు పుట్టి	200/-	260	0	0
సంచులు 100		103	12	0
,, ఫార్వర్డ్		97	0	0

An autobiography

CHILDHOOD
BOYHOOD
YOUTH

By. Leo Tolstoi

★

Pages 414 — Rs. 3—0—0

Postage extra.

Available at:

Visalaandhra Publishing House, Vijayawada.
OR
People's Book House, Hyderabad (Dn.)

పబ్లిక్ రంగాన్ని నీరసపరిచే పారిశ్రామిక విధానం

విడనాడాలని హైద్రాబాదు శాసనసభలో శ్రీ వి. డి. దేశపాండే హెచ్చరిక

(విశాలాంధ్ర విలేఖరి)

హైద్రాబాదు, మార్చి 15

పబ్లిక్ రంగాన్ని నీరస పరిచే ధోరణిని విడనాడాలని శాసనసభలో ప్రతిపక్ష నాయకుడు శ్రీ వి. డి. దేశపాండే హైద్రాబాదు రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమల పద్దులపై ప్రసంగిస్తూ కొన్ని సూచనలు చేశారు.

హైద్రాబాదు శాసనసభలో ఇవాళ ప్రశ్నోత్తరాల అనంతరం వాణిజ్య, పరిశ్రమల పద్దులకు సంబంధించిన కోత తీర్మానాలు చర్చకు వచ్చాయి.

శ్రీ పెండెం వాసుదేవ్ (ఫ్రంట్) తెలుగులో ప్రసంగిస్తూ ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయాలూ, వేసుకొన్న పథకాలూ వెంటనే అమలు జరిగేటట్లు చూడాలన్నారు. చేనేత కార్మికుల సమస్యలపై ప్రభుత్వంతీసుకొన్న చర్యలు కొంతవరకు లాభకరమే అయినా, నూలుధరలు పెరగడం వల్ల, బట్టధర నిలవబడడం వల్ల చేనేతపరిశ్రమలో కొత్త క్లిష్టస్థితిని కలిగిస్తూందన్నారు. మిల్లుయజమానుల లాభాలను నూలు ధరను కంట్రోలు చేసుకపోతే ఈ పరిశ్రమమీద ఇంత వరకూ చేసిన ఖర్చు వ్యర్థం అన్నారు.

హైద్రాబాద్‌లో పట్టు పారిశ్రామికులకు ఇచ్చిన సహాయం వుపయోగపడాలంటే వుత్పత్తి విడుదలకు ఏర్పాట్లు జరగాలన్నారు.

శ్రీ మగ్దూం మొహిదీన్ (ఫ్రంట్) దేశసంపద పెంచేటందుకు వీలయినఅవకాశాలన్నీ వెతకాలన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక విధానం రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధికి తోడ్పడంలేదనే తమ పాత ఆరోపణలను తిరిగి చెప్పకతప్పడంలేదన్నారు. రెండో పంచవర్ష ప్రణాళికలో భారీ పరిశ్రమలు ప్రభుత్వ యాజమాన్యాననిర్మించడానికై కేంద్రం తీసుకొన్న నిర్ణయాన్ని అభినందిస్తూ ఆ అభివృద్ధిలో తోడ్పడేటందుకు హైద్రాబాదులో అవకాశాలున్నా, దానిని వినియోగించుకోడం లేదు. ఉక్కుఫ్యాక్టరీ, ఎరువుల ఫ్యాక్టరీ వగైరాల నిర్మాణానికి వున్న గొప్ప అవకాశాల్ని వ్యర్థంచేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వాధీన పరిశ్రమలకు ప్రాముఖ్యత యిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం తన ఆధీనంలోని పరిశ్రమలనే బిర్లా వగైరాలకు స్వాధీన పరచడాన్ని విమర్శించారు. ప్రభుత్వ పరిశ్రమలలో ధనం, ఆదాయంపలువిధాలదుర్వ్యయం అయిపోతోందనీ, దానిని వారి దృష్టికి తెచ్చినా మాట్లాడ్డం లేదన్నారు. ప్రభుత్వం బోధనలో తన వద్దనున్న జొన్నలను (కార్మికులకై సేకరించినవి) అమ్మివేయదలచు కొన్నప్పుడు కార్మికులు వానిని కొనడానికి ముందుకువచ్చినా ఇవ్వక చౌకగా కంట్రాక్టరుకు అమ్మిన ఘటనను శ్రీ ముగ్దూం సభలో వివరించి ఈ విధానం సోషలిజానికి దారితీసేదికాదన్నారు. సెంట్రల్ స్టోర్స్ ద్వారా ఆఫీసులకు ఏటా కావలసిన, 2 కోట్లపై చిల్లర సరుకులను కంట్రాక్టర్ల ద్వారా కొనడంలో బాగా డబ్బు చేసుకొనడానికి వీలు చిక్కుతున్నదంటూ వుదాహరణగా మందుల పెట్టెలు 50 రు. లకు వచ్చే వానిని ప్రభుత్వం 250 రు. లకు కొన్న ఘటనలను వివరించారు. ఇంతదుర్వ్యయం ప్రభుత్వాన్ని ఎక్కడకు తీసుకుపోతుందో ఆలోచించమన్నారు.

శ్రీ ఆర్. బి. దేశముఖ్ (ప్రతిపక్షం) ప్రసంగిస్తూ 1954 ఆడిట్ రిపోర్టునుంచి ఎక్కువ విలువకు టెండర్లు తీసుకొన్న ఘటనలను ఉదాహరిస్తూ దుర్వ్యయాన్ని ఖండించారు. ప్రభుత్వప్రకటనలను బజారులో దుకాణంపెట్టి అమ్మించాలన్నారు. ఇప్పుడు అమ్ముతున్న పద్ధతి చాల కాలవ్యయం, శ్రమతోకూడినది కావడంచేత కొనదలచినవాళ్ళుకూడా వూరుకొంటున్నారనీ ఫలితంగా ప్రచురణలశాఖకు నష్టం రావడం ఆశ్చర్యంలేదనీ అన్నారు.

ప్రతిపక్ష నాయకుని సూచనలు

ప్రతిపక్ష నాయకుడు శ్రీ వి. డి. దేశపాండే (ఫ్రంట్) ప్రసంగిస్తూ రాష్ట్రంలోనిప్రకృతి సంపదలను వినియోగించగల పరిశ్రమల స్థాపనకై రెండో పంచవర్ష ప్రణాళికలో రాష్ట్రంలో 50 కోట్లకుపైగా ఖర్చు చేయవలసి వుందన్నారు. ప్రభుత్వ పరిశ్రమలను వ్యక్తుల కిస్తున్న ఘటనలను వుదహరిస్తూ ప్రభుత్వ విధానం పబ్లిక్ రంగాన్ని ఎత్తివేస్తూందిగాని వృద్ధిపరచడం లేదన్నారు. పారిశ్రామికోత్పత్తి దేశం మొత్తంమీద 500 కోట్లనుంచి 800 కోట్లకు పెరిగినా కార్మికుల కందులో వచ్చే వాటా 200 కోట్లు అల్లాగే వుండిపోయిందనీ, యజమానుల ఆదాయం మూడునుంచి ఆరువందలకోట్లకు పెరిగిందనీ, ఈ మాదిరి ప్రణాళికను ప్రజల ప్రణాళిక, సోషలిస్టు ప్రణాళిక అనలేమనీ అన్నారు. అదేస్థితి ఈరాష్ట్రంలోను వుందన్నారు. నిరుద్యోగ నివారణకై గ్రామ ఉద్యోగ శిక్షణా కేంద్రాల్ని నిర్మించడాన్ని అభినందిస్తూ, వానికై కేటాయించిన ధనంలో హెచ్చుభాగం వుద్యోగులకూ, అద్దెలకూ వ్యయపడకుండా చూడాలనీ, అక్కడ వుత్పత్తి అయిన సరుకును ప్రభుత్వావసరాలకుకొని ఆ సరుకులు ఖర్చుఅయే విధానంచూపాలనీఅన్నారు. అక్కడ పని చేసేవారికి ఇస్తున్న సాయం మాదిరిగా కొద్దిగొప్పోఇచ్చి సంతృప్తి పడరాదనీ, మామూలు కూలి యివ్వాలనీ అన్నారు. ప్రభుత్వం తయారు చేస్తున్న కోల్‌సైట్ (సెంట్రల్ లేబరేటరీస్ తయారీ) దీర్ఘకాలం మంటమీద వుండవలసిన అవసరం వున్నప్పుడే గిట్టుబాటు అవుతుందనీ, చిన్నవంటలకు మామూలు బొగ్గే చౌక అని చెప్పి, ఇంకా పరిశోధనలు జరిపి అందరికీ చౌకగా లభించే బొగ్గును తయారు చేయించాలన్నారు.

భూముల గరిష్ఠ పరిమితి

గంగాపూర్ ప్రాంతంలో రైతుల భూములన్నీ హరించిన పెద్ద పెద్ద జమీందార్లు భూమి గరిష్ఠ పరిమితులనుంచి తప్పించుకొనేటందుకై వాణిజ్యపంటలు వేయడానికుద్యుక్తులయి అక్కడ పంచదార ఫ్యాక్టరీకోసం ప్రయత్నిస్తున్నారనీ వారు కోరుతున్నట్లు ఫ్యాక్టరీ నెలకొల్పినా భూమి గరిష్ఠపరిమితులను అమలుజరిపి రైతులకు అందజేయాలని అన్నారు. వ్యవసాయం బాగాజరుగుతూందనీ, భూమిని విభజిస్తే ఉత్పత్తి పడిపోతుందనీ చూపి భూస్వాములు గరిష్ఠపరిమితిని అమలు జరగకుండా చేయడానికి వుద్దేశించారన్నారు.

పంచాయతీ బోర్డులకు కావలసిన సిరాబుడ్డికూడా హైద్రాబాద్ సెంట్రల్ స్టోర్సు నుంచి తీసుకోవలసి రావడం చాల దుర్వ్యయానికి కారణం అవుతూందనీ, ఎవరికివారు కొనుక్కొనే అధికారం ఇవ్వాలనీ అన్నారు. సెంట్రల్ స్టోర్సు కొనుగోలు, అమ్మకాల పరిశీలనకై అనధికార బోర్డును నియమించాలన్నారు.

శ్రీ బి. ధర్మభిక్షం (ఫ్రంట్): చేనేత పారిశ్రామికులకిచ్చిన మాదిరిగా కమ్మరులకు, వడ్రంగులకు, మొదలయిన వృత్తిపనులు చేసుకొనేవారికి కూడా సహకారం ఇవ్వాలన్నారు.

శ్రీ సి. హెచ్. వెంకట్రామారావు (ఫ్రంట్): 1956-57 లో మందుల కొనుగోలులోనూ, వాటి శ్రేష్టత్వ పరిశీలనలోనూ ప్రభుత్వం ప్రజాధనాన్నీ, ప్రజారోగ్యాన్నీ నిర్లక్ష్యం చేసిందన్నారు.

శ్రీ కె. వి. నారాయణరెడ్డి (స్వతంత్ర) నిజాం కాలంలో పరిశ్రమాభివృద్ధికి కృషి జరిగిందనీ, ఆజ్‌మాయిష్ ప్రభుత్వకాలంలో వాటిని నిలబెట్టేటందుకు కృషి జరిగిందనీ, కాంగ్రెసు పరిపాలన కాలంలో క్షీణదశ కనబడుతూందనీ అన్నారు. ఇతర రాష్ట్రాలన్నీ కేంద్రంనుంచి పెద్ద భారీ పరిశ్రమలను తమ తమ రాష్ట్రాలలోనిర్మింపచేసుకొంటూంటే హైద్రాబాదు వెనకబడిపోయిందని అన్నారు.

జీవిత భీమా జాతీయకరణం

భీమాఉద్యోగుల ప్రయోజనాలు రక్షించాలని అభ్యర్థన

విజయవాడ, మార్చి 15

ఆంధ్రరాష్ట్ర ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ కె. ఎల్. నరసింహం (ఎం. పి) గారు ఈ నెల 9 వ తేదీ విజయవాడ భీమా ఉద్యోగుల సమావేశంలో ఉపన్యసిస్తూ, ఇప్పుడున్న భీమా మేనేజిమెంటు ప్రభుత్వం నెలకొల్పనున్న కార్పొరేషన్‌లో అడుగుపెట్టేందుకై ప్రయత్నించవచ్చునని హెచ్చరించారు.

'భీమా జాతీయకరణ దినోత్సవం' సందర్భంలో రామమోహన లైబ్రరీ హాలులో ఈ సభ జరిగింది. భీమా ఉద్యోగులు, ఫీల్డువర్కర్లు, పాలసీ హోల్డర్లు, బ్యాంకుఉద్యోగులు తదితర పౌరులు సభకు హాజరయ్యారు.

శ్రీ నరసింహంగారు తమ ప్రసంగంలో భీమా మేనేజిమెంట్ల ప్రయత్నాలు ఫలిస్తే జాతీయకరణ వుద్దేశమే భగ్నమయి పోయి, స్వార్థపరులు తమ స్వప్రయోజనాలకై నిధులను మళ్ళించుకొంటారన్నారు. ఇటువంటి ప్రమాదం జరగకుండా వుండేట్లు జాగ్రత్త వహించాలన్నారు. మేనేజిమెంటులో అన్ని స్థాయిలలోను ఉద్యోగులకు ప్రాతినిధ్యం ఇవ్వవలసినఆవశ్యకత ఎంతైనా కలదన్నారు. భీమా ఉద్యోగులందరూ అఖిలభారత సంస్థను బలపరచుకోవాలని ఉద్బోధించారు.

శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు గారుమాట్లాడుతూ, వీలైనంత త్వరలో బ్యాంకుల జాతీయకరణ జరుగుతుందన్నారు. భీమాకంపెనీలలో ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులందరికీ భవిష్యత్తులో ఉద్యోగాలు దొరుకుతాయని ఆశిస్తున్నామన్నారు.

ఆంధ్రరాష్ట్ర మోటారు యూనియన్ కాంగ్రెసు ప్రధాన కార్యదర్శి శ్రీ కె. రామబ్రహ్మంగారు కార్పొరేషన్ సరిగా పనిగా చేస్తుందనే విషయమై సందేహం వెల్లడించారు.

భీమా పరిశ్రమలో జనరల్ సెక్షన్‌ను జాతీయం చేయడానికై తగు చర్యలు తీసుకొని జనరల్ డిపార్టుమెంటులో ఇప్పుడు పనిచేస్తున్న భీమాఉద్యోగులప్రయోజనాలుభగ్నం కాకుండా చూడాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు.

భీమా ఉద్యోగులందరూ యూనియన్లుగా ఏర్పడి, విశాలాంధ్ర భీమా ఉద్యోగుల ఫెడరేషన్ నిర్మాణానికై తగుచర్యలు తీసుకోవాలని వేరొక తీర్మానం చేశారు.

తిరునాళ్లలో పార్టీనిధి వసూళ్లు

రేపల్లె, మార్చి 14

గుంటూరుజిల్లా రేపల్లె తాలూకా కమ్యూనిస్టు కార్యకర్తలు శ్రీయుతులు బలరామయ్య, శ్రీరాములు, సీతారామయ్య, రాజబాపయ్యగార్లు మరికొందరితో కలిసి అరవపల్లిలో రు 52-1-3 లు వసూలుచేసి ఆ మొత్తం కమ్యూనిస్టు పార్టీనిధికి సమర్పించారు.

గోవాడలో

గుంటూరు జిల్లా గోవాడ తిరునాళ్ళలో శ్రీయుతులు దొంతు నాగయ్య, ఘంటా సీతారామయ్య గార్లు మరికొందరితో కలిసి రు. 51-0-3 లు సేకరించి మొత్తం కమ్యూనిస్టు పార్టీనిధికి జమకట్టారు.

సభలు సమావేశాలు

గుంటూరుజిల్లా రైతుసంఘ కార్యవర్గ సమావేశం యీనెల 20 వ తేదీన గుంటూరులో జరుగుతుంది.

ఉపాధ్యాయుల కష్టగండ్లు

హైద్రాబాదు శాసనసభలో శ్రీ కె. యల్. నరసింహారావు వివరణ

(విశాలాంధ్ర విలేఖరి)

హైద్రాబాద్, మార్చి 15

హైద్రాబాద్ శాసనసభలో నిన్న ఆర్థికమంత్రి ప్రవేశపెట్టిన ఫైనాన్సు స్టాటిస్టిక్సు, సుంకాల పద్దులమీద శాసనసభలో కోతతీర్మానాలు చర్చకు వచ్చినప్పుడు ప్రతిపక్ష సభ్యులు శ్రీ కె. యల్. నరసింహారావుగారు ఆర్థిక శాఖలోని వుద్యోగుల లంచగొండితనాన్నీ, ప్రజాపీడన పద్ధతుల్నీ, వివరిస్తూ ఉపాధ్యాయులు తమ వేతనాలలో మొదటి నెలజీతం లంచంగా యిస్తేతప్ప వాళ్ళబిల్లులు ప్యాసుకావడంలేదన్నారు. ఉదాహరణగా శ్రీ మోహన్‌రావు అనే ఉపాధ్యాయునికి రావలసిన 52 ఆఖరునాటి జీతాలు నేటి వరకూకూడ ముట్టలేదని వివరిస్తూ ఇలా అన్నారు:

"యం. మోహన్‌రావు అనుతను యిల్లెందు తాలూకా కారేపల్లి స్టేషను ప్రైమరీ స్కూల్‌లో సెప్టెంబర్ 1952 నుండి ఫిబ్రవరి 1953 వరకు ఉపాధ్యాయుడుగా పనిచేశాడు.

"ఆ ఆరుమాసాలు జీతబత్తాలు లేకుండా పనిచేయటం జరిగింది. ఆచారం ప్రకారం అతను విద్యాశాఖ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలోను డి. ఇ. ఓ. ఆఫీసులోను తనకు ప్రథమంగా లభించు వేతనంలోనుండి చెరియొక నెల వేతనం లంచగా ఇచ్చుకొనలేదు ఫలితంగా అతని జీతాల బిల్లులు పంపటంలో విద్యాశాఖ వారును, మంజూరుచేయటంలో ఆర్థిక శాఖ వారునుతాత్సారం చేస్తూ వచ్చారు.

"యింతలో అతను దాదాపు రెండు సంవత్సరాల క్రితం మరణించాడు. ఆనాటినుండి నేటివరకు అతని తండ్రి తన కుమారునకు రావలసిన డబ్బు విషయంలో పదేపదే విద్యాశాఖవారికి విన్నవించుకొన్నా అతని మొర నాలకించువారు లేకపోయారు.

"తుదకు నేనుకూడా నవంబర్ నెలలో మంత్రిగారికి ఫిర్యాదు చేశాను. దానిపై చర్య తీసుకొంటున్నట్లు ఆర్థికశాఖవారికి వ్రాసినట్లు తెలిపారు. కాని నేటివరకు ఆ డబ్బు మంజూరు కాలేదు.

"జీతాలబిల్లుల్ని తిరిగి వ్రాయాలని ఒకసారి, తిరిగి వ్రాసిపంపిన తరువాత నాల్గుకాపీలు పంపాలని మరోసారి ఈవిధంగా క్రిందినుండి పైకి పైనుండి క్రిందికి కాగితాలు త్రిప్పటం మినహా ఏమీ జరుగుటలేదు."

స్కూళ్ళ నిర్మాణం

తర్వాత ప్లానింగ్ కమిటీల ప్రోత్సాహంతో గ్రామాలలో ప్రజలు ముందుకు వచ్చి చేస్తున్న పనులకు డబ్బు మంజూరు చేయడంలేదనీ, ఇదే కొనసాగితే ప్రజలు అభివృద్ధిప్రణాళికలకు తోడ్పడే అవకాశం కూడా సన్నగిల్లుతుందనీ హెచ్చరిస్తూ ఇల్లాఅన్నారు:

'జిల్లాప్లానింగ్ కమిటీ స్కూళ్ళ, లైబ్రరీలు, బావులు మొదలగు పనులను నవంబర్ నెలలో మంజూరు చేసింది. డిసెంబర్ నెల ఆఖరులో తహశీల్ ద్వారా రైతులకు తెలుపబడింది. రైతులు జనవరి నెలలో తాము చెల్లించవలసినవిరాళాలను, తోడ్పాటు గురించి సంప్రదించుకొనటం వసూలు చేసుకొనటం జరిగింది. ఫిబ్రవరి నెలలో వస్తుసామగ్రి పోగుచేసుకొని నిర్మాణం ప్రారంభించారు.

ఓవర్సియరువచ్చి ఇల్లెందుతాలూకా ముచ్చర్ల స్కూలుకు, పండితాపురం స్కూలుకు కారేపల్లి స్టేషన్‌లో లైబ్రరీకి స్థలం ఇచ్చాడు. మూడు చోట్లా రైతులు తమడబ్బుతో పునాదులులేపారు. కొన్నిచోట్ల బేసుమట్టం కూడా పూర్తి చేశారు. ఇప్పుడు అధికారులు మార్చి 31 వస్తున్నది ఆలోగా నిర్మించటం మాకు ఏవిధంగాను చేతగాదు. కావున మీకు డబ్బు ఇవ్వటంకుదరదంటున్నారు. ఓవరిసియర్ బిల్లులు చేసిఇస్తే వాటిని పట్టుకొని వెళ్ళి మూడు నాల్గు రోజులు జిల్లా కేంద్రంలో ఆఫీసుల చుట్టూ తిరిగి వేసారి ఇంటికి తిరిగి వస్తున్నారు. గతసంవత్సరం మంజూరు చేయబడి ప్రారంభింప బడిన పనులు ఆర్థిక సంవత్సరం ముగిసిందనే పేర వెనుకకు నెట్టబడకుండాను, ఆగిపోకుండాను చూడాలి. వానికి సంబంధించిన డబ్బును జిల్లా అధికారులు డ్రా చేసి అమానతులో ఉంచి వాటి నిర్మాణం జరిగి పోవునట్లు చూడాలి. అన్నారు.

విజయవాడ రేడియో కేంద్రం

నాటకోత్సవ ప్రత్యేక కార్యక్రమాలు

18-3-56 ఆదివారము రాత్రి 9-45 - 11-0 పెద్ద మనుష్యులు
(రంగస్థలమున) రచన: సోమంచి యగ్గెన్నశాస్త్రి,
నిర్వహణ: రాఘవ కళాకేంద్రము;
19-3-56 సోమవారం రాత్రి 8-0 - 9-0 విముక్తి
రచన: పి. రామకృష్ణయ్య, నిర్వహణ: ఆంధ్రా ఆర్టు థియేటర్స్;
20-3-56 మంగళవారం రాత్రి 9-30 - 11-0 ఓమర్ విమోచన
(రంగస్థలమున) రచన: బుచ్చిబాబు,
నిర్వహణ: అరుణోదయ నాట్యమండలి.

రేడియో

మార్చి 18 ఆది॥

విజయవాడ: (357.1 మీటర్లలో) ఉదయం:
6-50 స్వాగతము;
6-55 ప్రసారవిశేషాలు;
7-0 (తె. వా.);
7-15 ఉదయగానం;
7-30 హిందీ రికార్డులు;
8-0 (ఆం. వా.);
8-15 వాద్యసంగీతం;
8-30 పుష్పవర్ణనము;
1-0 మద్రాసువలె;
1-30 గీతావళి;
1-40 హిందీలో వార్తలు
1-50 (తె. వా.);
4-0 బొమ్మరిల్లు;
5-30 సంకీర్తనం;
6-0 గీతావళి:
6-15 (ప్రాం. వా.);
6-25 స్థానికప్రకటనలు;
6-30 కాళిదాసు - వీధి నాటకం, మొ॥ భా॥
7-0 (తె. వా.);
7-15 కాళిదాసు - వీధి నాటకం, రెం॥ భా॥
7-30 ఆకాశవాణి,
8-0 సంకీర్తనం;
9-0 (ఆం. వా.);
9-15 గీతావళి: బొడ్డుపల్లి సైదులు;
9-30 రసమయి;
9-45 పెద్దమనుష్యులు: రంగస్థల నాటకము;
11-0 సమాప్తి.

మద్రాసు బి. (211.3 మీటర్లలో) ఉదయం:
6-50 స్వాగతము;
7-0 (తె. వా.);
7-15 ఉదయగానము;
7-30 పాపామలర్ (త)
8-0 (ఆం. వా.);
8-15 ఓ పెన్ తుల్లల్ (మ)
8-30 పుష్పవర్ణనము;
8-45 నాటిక- (కన్నడ)
1-0 వాద్యగోష్ఠి;
1-30 (ఆం. వా.);
1-40 గీతమాలిక;
1-50 (తె. వా.);
2-0 వేణువు;
2-15 ఆటవిడుపు;
3-0 లలితాభాను;
4-0 లలితగానం;
5-30 సంకీర్తనం;
6-0 (ఆం. వా.);
6-15 (ప్రా. వా.);
6-25 లలితగీతము;
6-30 కాళిదాసు - వీధి నాటకం, మొ-భా॥
7-0 (తె. వా.);
7-15 కాళిదాసు - వీధి నాటకం, రెం-భా॥
7-30 గానమాధురి;
7-45 శ్రోతల పరిచయం
8-0 సంకీర్తనం;
9-0 (ఆం. వా.);
9-15 యం. యస్. ఓ.
9-30 రసమయి;
9-45 పెద్దమనుష్యులు: రంగస్థల నాటకము;
11-0 సమాప్తి.

హైద్రాబాద్: (411.0 మీటర్లలో) ఉదయం:
6-50 సుప్రభాత్;
6-55 కార్యక్రమవివరణ
7-0 (తె. వా.);
7-15 ఉదయగానము;
7-30 సంగీతపాఠం;
7-45 (క. వా.);
8-0 (ఆం. వా.);
8-15 (హిం. వా.);
8-30 ఆవో బచ్చో;
8-15 బాలవినోదం;
10-0 గీతావళి:
10-15 వీణ;
10-45 ఖయాల్;
11-15 గీత్, భజన్;
11-30 భువనవిజయము;
12-30 చిత్రమాధురి;
12-50 (మ. వా.);
1-0 ఖయాల్ శుద్ధసారంగ్;
1-30 పద్యావళి;
1-50 (తె. వా.);
5-30 ఖయాల్ పట్‌దీప్
5-45 ఘజల్, గీత్;
6-0 మ. కార్యక్రమం;
6-30 సుధాగాన్;
6-40 స్థానికప్రకటనలు;
6-45 గీతావళి: విమలా పద్మనాభన్;
7-0 (తె. వా.);
7-15 అంగదరాయబారం వీధినాటకం;
7-45 భజన్ గీత్;
8-0 ప్రస్తుతవిశేషము
8-15 వీణ;
9-0 (ఆం. వా.);
9-15 (ఉ. వా.);
9-30 రసమయి;
9-45 వీణ;
10-0 గీతావళి;
10-15 వీణ;
10-45 ఖయాల్;
11-15 గీత్, భజన్;
11-30 సమాప్తి.

పోలేకుర్రు, పెనుమంచిలి పేదలకు ఇండ్ల స్థలాలు

సాంఘిక సంక్షేమ మంత్రికి మెమొరాండం

కర్నూలు, మార్చి 14

కమ్యూనిస్టు శాసనసభ్యులు శ్రీ గంజి నాగేశ్వరరావుగారు నిన్న సాంఘిక సంక్షేమ శాఖామంత్రి గౌతు లచ్చన్న గారిని కలుసుకుని 1955 ఫిబ్రవరిలో కాకినాడ తాలూకా పోలేకుర్రు శివారు ముత్యాలమ్మపేటలో 10 మంది హరిజనులకొరకు ప్రభుత్వం అక్వైరుచేసిన 50 సెంట్ల స్థలాన్ని యింతవరకు స్వాధీనం చేయలేదనీ, యీ 10 మంది గోడ్డుప్రక్కన చినచిన్న గుడిసెలు వేసుకుని బాధపడుతున్నారనీ, వెంటనే వాటిని పేదలకు స్వాధీనం చేయాలనిచెప్పి ఒక పిటీషను యిచ్చారు.

నర్సాపురం తాలూకా పెనుమంచిలి హరిజనులు 8 మంది చాలకాలం నుండి నర్సాపురం సబ్‌కలెక్టరు గ్రాంటు చేసిన పోరంబోకులో ఇండ్లు వేసుకుని జీవిస్తున్నారనీ, 5 సంవత్సరాలనుండి ప్రభుత్వం వారిపై 7 వ సెక్షన్ నోటీసులు అమలుజరుపుతూ పెనాల్టీలు విధిస్తూందనీ, యిప్పుడు 6 వ సెక్షను నోటీసులు పంపుతూ తొలగిపొమ్మని వత్తిడి చేస్తూందనీ తెలియజేశారు. ఆ నోటీసులను ఉపసంహరించుకొని వారికి పట్టాలు యివ్వాలనికోరుతూ మరొక పిటీషన్ను సమర్పించారు.

మంత్రి సమాధానం చెపుతూ పోలేకుర్రు, పెనుమంచిలి హరిజనుల యిండ్ల విషయం వెంటనే దర్యాప్తు చేసి చర్యతీసుకుంటామని చెప్పారు.

* * *

కెనడా సందర్శించవలసిందిగా భారత ప్రధాని నెహ్రూను ఆహ్వానించినట్లు కెనడా పార్లమెంటులో వెల్లడైంది.

జీవనభృతికోసం చేతి పరిశ్రమలు

గ్రామాలలోను, పట్టణాలలోను నెలకొల్పాలని విజ్ఞప్తి

ఇందుపల్లి, మార్చి 14

కృష్ణాజిల్లా గన్నవరం తాలూకా మహిళా సంఘ కార్యవర్గంవారు నిన్నటిరోజు ఉయ్యూరులో సమావేశమై, ప్రభుత్వం గ్రామాలలోను, పట్టణాలలోను చేతి పరిశ్రమలు విరివిగా నెలకొల్పి, పూర్తి కాలమంతా పనులు దొరకక పస్తులుంటున్న కుటుంబాలకు జీవనభృతి కల్పించాలనీ కోరుతూ తీర్మానించారు. శ్రీమతి పెనమకూరి లక్ష్మీకాంతమ్మ గారుసమావేశానికి అధ్యక్షత వహించారు.

ఆంధ్రశాసన సభలో కట్నం నిషేధపుబిల్లును ప్రవేశపెట్టడంపట్ల హర్షం ప్రకటిస్తూ, స్త్రీధనంకింద ఇచ్చే సొమ్మును కట్నంగా పరిగణించకుండా వుండేట్లు మినహాయింపు క్లాజు చేర్చాలని కోరారు. హిందూ వారసత్వపు బిల్లును ఆంధ్రరాష్ట్రమహిళా సంఘంవారి సవరణలతో వెంటనే ప్యాసుచేయాలని ఇంకొక తీర్మానంలో కోరారు. బుర్రకథలనైన, నాటకాలనైన అంక్షలు విధించే బిల్లును ఉపసంహరించు కోవాలని ఆంధ్రప్రభుత్వాన్ని కోరారు.

మార్చి 31 వ తేదీనాటికి అన్ని గ్రామాలలోను సభ్యత్వం చేర్పించాలని, ఏప్రిల్ మూడవ వారంలో తాలూకా మహాసభ జరపాలని నిశ్చయించారు.

ఆంధ్ర ప్రభుత్వం
విద్యుచ్ఛక్తిశాఖ,
టెండరు నోటీసు

చిలకల్లు సబ్‌స్టేషన్‌వద్ద రెసిడెన్షియల్ మరియు నాన్ రెసిడెన్షియల్ భవనముల నిర్మాణమునకై కోరబడిన టెండర్లు చేరు గడువు (6-2-1956 మరియు 8-2-1956 తేదీలలో ప్రకటించబడినది) 29-3-56 వరకు పొడిగించడమైనది.

బి. గజపతిరావు, సూపరింటెండింగ్ ఇంజనీర్, జెనరల్ కన్‌స్ట్రక్షన్ సర్కిల్ (ఈస్ట్) వాల్తేర్ ఆర్. యస్.
టెలిగ్రామ్సు: "CONSENGER"

నోటీసు

మహారాజశ్రీ ప్రొద్దుటూరు
జి॥ మునసఫు కోర్టులో

O. S. 311/55

బి. వెంకన్న గురప్పపొట్టనవన్ను
(1) బి. గురుస్వామి
(2) బి. వెంకటసుబ్బయ్య } వాద్లు
రాం గోపాలు భజాసి
లాల్-రతి ప్రతివాది

దావా వాదుల వద్ద ప్రతివాది జరిపిన లావాదేవీలో నిల్చుపోను వడ్డి అస్సలు వగైరా బాపతు అచ్చవలసిన రు 605-12-0 లకు గాను యీదావాను ప్రతివాదిపైన వాద్లు దాఖలు చేసి వున్నారు. యిందుకు యేమైనా ఆక్షేపణ వున్న యెడల ప్రతివాది పై కోర్టులో 29-3-56 తేదీ వుదయం 10 గంటలకుహాజరై తెలుపుకోనంతట దావా అతని పరోక్షమందు తీర్మానించడమవును.

ఆర్. నారాయణరావు.
వాది తరఫు వకీలు.



ఇండియా
టీ
ఇండియా
భాగ్యం

వైశాల్యం; ఉత్పత్తి:
7,89,000 ఎకరాల విస్తీర్ణంగలిగిన 6,300 తేయాకుతోటలు ఇండియాలో వున్నవి. సాలీనా వీటన్నింటిలోను దరిద 63 కోట్ల పౌనుల తేయాకు ఉత్పత్తి అవుతుంది.

అతిస్వల్ప ధరలో [illegible] పానీయము [illegible]
తేనీరు

TEA BOARD INDIA

PST 154

For accuracy
and satisfaction
EXPRESS
QUALITY
EXPRESS PRIMA
EXPRESS & PREFECT
WATCHES • CLOCKS • TIMEPIECES

EXPRESS
WATCH CO.
78, ABDUL REHMAN ST.,
BOMBAY 3

Available From All Leading Dealers.



సాధారణ ప్రజలపై భారం పెంచి అభివృద్ధి కార్యక్రమాన్ని సాధించ జూస్తున్న బడ్జెట్ :

లోక్‌సభలో శ్రీ గోపాలన్ విమర్శ

(విశాలాంధ్ర విలేఖరి)

న్యూఢిల్లీ, మార్చి 15

ఈ బడ్జెట్ ప్రజాసామాన్యంపై భారాన్ని ఇంకా పెంచి దేశాభివృద్ధి కార్యక్రమాన్ని సాధింప జూస్తున్నదనీ, నిరుద్యోగ ప్రమాదమూ, ప్రజాపీడనా తొలగిననాడే దేశం అభివృద్ధి పొందిందని ఎవరైనా అనగలరనీ, నేడు లోక్‌సభలో బడ్జెటుపై సాధారణచర్చ సందర్భంలో ప్రసంగిస్తూ ప్రతిపక్ష నాయకుడు శ్రీ ఏ. కె. గోపాలన్ విమర్శించారు.

శ్రీ గోపాలన్ తన ప్రసంగంలో ఇలా అన్నారు :

“రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొనే ఈ బడ్జెటును రూపొందించారనేది స్పష్టం. బయటికి కనిపించేదానికన్నా నిజానికి ఇంకా ఎక్కువ పన్నుల భారాన్ని ఈ బడ్జెటు ప్రజలపై మోపుతూంది. సామాన్య ప్రజలపై భారం పెంచి జాతీయాభివృద్ధి కార్యక్రమాలను సాధింప జూస్తూంది ఈ బడ్జెట్.

“సంతత నిరుద్యోగ భయమూ, ఉన్న ఉద్యోగంకూడా ఊడిపోయే ప్రమాదమూ అంతరించినప్పుడూ, అశేష ప్రజాసామాన్యం ఆకలితో అలమటిస్తూ యమయాతనలకు లోనయే దుస్థితి తొలగినప్పుడూ, దేశప్రయోజనాలను బలిపెట్టి సామాన్య ప్రజలకడుపుకొట్టి ధనిక వర్గాలు తమ లాభాలను పెంచుకుంటూ ఉండే పరిస్థితి అంతరించినప్పుడూ మాత్రమే దేశం అభివృద్ధి పొందుతూంది అని ఎవరైనా అనగలరు.?”

దేశంలో ఆహార ధాన్యాల పంట పెరిగిందన్న విషయం నిజమే అని గోపాలన్ అన్నారు. 42 లక్షల టన్నులు ఉత్పత్తి పెరిగిందన్నారు. అయితే జపాను వరిసాగు పద్ధతులను విస్తారంగా అమలు జరపడమూ, అదునులో మంచివర్షాలు కురవడమూ ఇందుకు కారణమన్నారు.

“ఒకవైపు పంటలు పెరిగినా, మరోవైపు ధరలు పడిపోయి వ్యవసాయదారులకు వేలకొలది కోట్ల రూపాయల నష్టం కలిగింది. ముఖ్యంగా వ్యవసాయకూలీల వేతనాలు తగ్గిపోయాయి. ధనికులలాభాలు పెరగడానికి అప్పుడు కూడా అంతరాయం ఏమీ కలగలేదు” అని అన్నారు.

వ్యవసాయ సంస్కరణల సమస్య

కౌలుదార్ల సమస్యను గురించి ప్రస్తావిస్తూ, వ్యవసాయ సంస్కరణలను అమలు జరిపే ఉద్దేశం ప్రభుత్వానికి నిజంగా ఉన్నదా అని గోపాలన్ ప్రశ్నించారు. అనుకున్న మేలును వ్యవసాయ సంస్కరణలు కలిగించలేకపోయాయి అని ప్రణాళికా సంఘం వారే తమ నివేదికలో అన్నమాటలను గోపాలన్ ఉదహరించారు.

జేవఖల్ నిషేధ చట్టాల విషయం ఆయన పేర్కొన్నారు. “ఆంధ్ర, కేరళ, అస్సాం, మలబార్, మహారాష్ట్రల్లో రాష్ట్ర ప్రభుత్వాలే కౌలుదార్లను వెళ్ళగొడుతున్నాయి. అడవుల అభివృద్ధి, రాజకీయ బాధితులకు భూములు, మేలురకపు సాగు పద్ధతులని ఏవేవో కారణాలు చెప్పి, ఈ తొలగింపు కార్యక్రమాన్ని ప్రభుత్వాలే సాగిస్తున్నాయి. ఆహార ధాన్యాల అధికోత్పత్తి ప్రణాళిక కింద వ్యవసాయదారులకు భూములను ఇచ్చిన ప్రభుత్వాలే ఇప్పుడు, ఆహార ధాన్యాల పరిస్థితి సంతృప్తికరంగా ఉందని సాకుచూపి, ఆ భూములను లాక్కొంటున్నాయి”

కౌలుదార్ల తొలగింపుని నిరోధించవలసిందని గోపాలన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

సాగుకు లాయకయిన బంజరు భూములు దేశంలో 12 కోట్ల యకరాలున్నాయని గోపాలన్ తెలిపారు. ఈ భూములను గాని భూమిలేని వ్యవసాయదారులకు పంచిపెట్టి, యకరాకు రెండురూపాయల చొప్పున మాత్రమే పన్ను వసూలుచేసినా, ప్రభుత్వానికి 24 కోట్ల ఆదాయం ఉంటుందన్నారు. “కాని, మీ రాపనికి పూనుకోవడం లేదు. ఎందువల్ల? ఈ బంజరుభూములన్నీ ఎవరో కొందరు భూస్వాముల చేతికింద ఉండడంవల్లనే” అని విమర్శించారు.

“దేశంలో ఉత్పత్తి పెరిగిందనీ, జాతీయాదాయం పెరిగిందనీ మీరంటున్నారు. కాని, ఈ పెరుగుదలవల్ల లాభం పొందినది సామాన్య రైతులూ, వ్యవసాయకార్మికులూ మాత్రం కారు” అని అన్నారు.

దేశంలో నిరుద్యోగం

దేశంలోని నిరుద్యోగ సమస్య తీవ్రతను గురించి గోపాలన్ ప్రసంగించారు. రక్షణశాఖ పనివారిలో పదివేలమంది నిరుద్యోగులు కాబోతున్నారనీ, మెట్రిక్యులేషన్ కన్న ఎక్కువ చదువులు చదివినవారిలో అయిదున్నర లక్షలమంది ఉద్యోగాలకోసం అల్లాడుతున్నారనీ, ప్రస్తుతం దామోదరలోయ ప్రాజెక్టులో పనిచేస్తున్న 18 వేలమంది పనివారు నిరుద్యోగులయే ప్రమాదం ఉన్నదనీ, ఇంతేకాకుండా దక్షిణాన బీడి, పింగాణీ ఫ్యాక్టరీలు మూతబడుతున్నాయనీ గోపాలన్ తెలిపారు.

తోటపనివారి కనిష్ట వేతనాల చట్టంలాంటి అనేక చట్టాలు అమలు జరగడం లేదని చెప్పి, కాగితాలపై కనిపించే ప్రయోజనాలయినా కార్మికులకు దక్కకుండా పోతున్నాయన్నారు. ఆర్థిక వ్యవస్థలోని ప్రభుత్వ అధీన రంగంలోనూ, ప్రైవేటు రంగంలోనూఉన్న వేతనాల పరిస్థితినంతా క్షుణ్ణంగా పరిశీలించి, తగు నిర్ణయాలు చేసేందుకు వేతనాల పరిశీలక సంఘాన్నొకదానిని ఏర్పరచవలసిందని కోరారు.

చిన్న పరిశ్రమలకు కావలసిన సహాయం అందజేసేందుకు ఏర్పడిన పెట్టుబడి సంస్థలవల్ల ఆశించిన ఫలితాలేమీ చేకూరడం లేదన్నారు. చిన్న పరిశ్రమలలో పని ప్రారంభించేందుకు కావలసిన మూలధనానికి ఈ సంస్థలు అడ్వాన్సు ఇవ్వడానికి నిరాకరిస్తున్నాయన్నారు.

పన్నుల ప్రతిపాదనలను గురించి ప్రస్తావిస్తూ, అత్యవసరంకాని నూనెల మీద ఎక్సైజు సుంకాలు విధించడం, కొబ్బరినూనెనే ముఖ్యంగా ఉపయోగించే మలబారు ప్రజలకు నష్టదాయకమన్నారు.

లివర్ బ్రదర్స్‌లాంటి కంపెనీలపై ఎక్సైజు సుంకాలు పెంచి, దేశంలోని చిన్నచిన్న జాతీయ కంపెనీలకు ప్రోత్సాహం కలిగించాలన్నారు.

రాబడిని పెంచడానికిగల వనరులన్నిటినీ వినియోగించాలని సూచిస్తూ ప్రథమంగా కలవారినుండీ, ఇవ్వగలవారినుండీ రాబట్టాలనీ, ఆ తరువాతనే సాధారణ ప్రజలజోలికి పోవాలనీ అన్నారు.

కాంగ్రెసు కార్యదర్శులలో ఒకరయిన శ్రీమన్నారాయణ (మధ్యప్రదేశ్) మాట్లాడుతూ, దేశంలో సోషలిస్టు సమాజాన్ని నిర్మించాలంటే, నిరుద్యోగ సమస్యనూ, ఆర్థిక సమానత సమస్యనూ అత్యవసరంగా పరిష్కరించాలన్నారు.

ఉద్యోగాలు కల్పించడం విషయంలో రెండవ పంచవర్ష ప్రణాళిక లక్ష్యాలను పెంచాలనీ, అంబరుచర్ఖా వగైరాలను ప్రోత్సహించాలనీ అన్నారు.

వేతనాలలో తారతమ్యాన్ని తొలగించేందుకు ప్రభుత్వం ఒక వేతన నిర్ణాయకసంఘాన్ని నియమించాలన్నారు.

కనిష్ట ఆదాయాల తరగతివారి ఆదాయాల్లోనే అత్యధిక పెరుగుదల ఉండేలాచేసేందుకు తగినట్లుగాపన్నుల విధానాన్నీ, ఆర్థిక విధానాన్నీ సవరించాలనీ, అలా చేయనంత కాలం జాతీయ ఆదాయం పెరిగిందని అనడంలో అర్థంలేదనీ అన్నారు.

ఐక్య ఉద్యమ నిర్మాణానికి అందరు సహకరించండి

◆◆◆

రైల్వే కార్మికులకు శ్రీ జయప్రకాశ్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, మార్చి 15

ఐక్యరైల్వే కార్మికసంఘ నిర్మాణానికి శ్రీ గురుస్వామి, వాసవదాలు అంగీకరించినందుకు హర్షం వెలిబుచ్చుతూ శ్రీ జయప్రకాశ్ నారాయణ నేడు ఒక ప్రకటనచేశారు. రైల్వే కార్మికసంఘాలలో ఏర్పడిన అనైక్యతవలన ఇప్పటికే చాలనష్టం వాటిల్లిందనీ, ఐక్యఉద్యమ నిర్మాణానికి ఇది కట్టకడపటి అవకాశమనీ శ్రీ నారాయణ అన్నారు.

ఈ ఒప్పందం కుదరడానికి దోహదం చేసిన శ్రీ జయప్రకాశ్ నారాయణ తమ ప్రకటనలో ఇలా తెలియజేశారు :

“ఇండియన్ రైల్వేమెన్స్ ఫెడరేషన్, ఇండియన్ నేషనల్ రైల్వే వర్కర్స్ ఫెడరేషన్లు రెండింటినీ కలిపివేయాలని 1953లో ఒక ఒప్పందం కుదిరింది. దురదృష్టవశాత్తు అనేక కారణాలవలన, ముఖ్యంగా శ్రీహరిహరనాథశాస్త్రి మరణంవలన ఈ ఒప్పందం అమల్లోకి రాలేదు. రైల్వే కార్మికులు చీలిఉండిపోయారు. ఇటీవల ఈ ఒప్పందాన్ని అమలులో పెడదామని ప్రయత్నాలు జరిగాయి కాని అవికూడా ఫలించలేదు.

“రెండురోజులక్రితం రైల్వేమంత్రి శ్రీ లాల్‌బహదూర్‌శాస్త్రి, కార్మికశాఖామంత్రి శ్రీ కండూభాయిదేశాయిగార్ల సమక్షంలో ఐక్య సంభాషణలు జరిగాయి. వాసవదా, శ్రీ గురుస్వామిగార్లు ఉభయసంఘాల తరఫున మాట్లాడారు. చివరకు పరస్పర చర్చల ద్వారా పూర్తి ఒప్పందం కుదిరింది. సంఘాల విలీనీకరణ గురించి కొత్త షరతులను రూపొందించారు. ఐక్యత కోసం విశాలదృక్పథం చూపిన శ్రీ వాసవదా, శ్రీ గురుస్వామిగార్లను అభినందిస్తున్నాను. దేశంలోని రైల్వే కార్మికులందరు తమ నాయకులను బలపరచి, ఈ ఒప్పందాన్ని అమలు జరపడంలో అన్నివిధాలా తోడ్పడాలని కోరుతున్నాను.”

నాగార్జున సాగర్‌వద్ద రైలువంతెన నిర్మించడంలేదు

హైదరాబాద్ శాసనసభలో మంత్రి ప్రకటన

హైదరాబాద్, మార్చి 15

నాగార్జున సాగర్ ప్రాజెక్టువద్ద కృష్ణానది కిరువైపుల అనుకూలంగా ఉండడంవలన అక్కడ రైలువంతెన నిర్మించాలనే యత్నం వమలుకున్నారని హైద్రాబాద్ శాసనసభలో పి. డబ్ల్యు. డి శాఖామంత్రి శ్రీ జి. యస్. మేల్కోటే నేడు తెలియజేశారు. రైల్వేబోర్డు సూచన మేరకు నాగార్జున సాగర్ బోర్డు ఈ నిర్ణయం చేసిందనీ, ప్రస్తుతం ముప్ఫై లక్షల వ్యయంతో రోడ్డు వంతెనను మాత్రమే నిర్మిస్తున్నారని తెలిపారు.

ఇండోర్‌లో గడియారాల ఫ్యాక్టరీ

గ్వాలియర్, మార్చి 14

మధ్యభారత ప్రభుత్వం ఇండోర్‌లో ఒక గడియారాల ఫ్యాక్టరీని నెలకొల్ప సంకల్పించినట్లు వాణిజ్యమంత్రి శ్రీ శ్యామలాల్ పాండవీయ నేడు శాసనసభలో వెల్లడించారు.

మంత్రులకు ఉచిత వైద్యం

శాసన సభలో ప్రశ్నలు

(విశాలాంధ్ర విలేఖరి)

కర్నూలు, మార్చి 15

మంత్రులు నెలకు వేయి రూపాయల జీతం తీసుకొంటూకూడా ఉచిత వైద్య సౌకర్యాలు అనుభవిస్తూ వుండడం భావ్యమా అని కాంగ్రెసు సభ్యుడు బసిరెడ్డిగారు నేడు ఆంధ్ర శాసనసభలో ప్రశ్నించారు. పొదుపు కార్యక్రమం విషయంలో మంత్రులు ప్రజలకు ఆదర్శప్రాయంగా వుండాలి కదా అన్నారు.

ఆప్రశ్నకు ఆరోగ్యశాఖా మంత్రి తరఫున స్థానిక స్వపరిపాలన మంత్రి నాగేశ్వరరావుగారు జవాబిస్తూ తాను వ్యక్తిగతంగా సభ్యుని అభిప్రాయంతో ఏకీభవిస్తున్నా మన్నారు.

మంత్రులకున్న ఈ ఉచిత వైద్య సౌకర్యం శాసనసభ్యులకు కూడా కల్పించడం సాధ్యంకాదని ఉమ్మడి మద్రాసు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

ఉపముఖ్యమంత్రి సంజీవరెడ్డిగారు మధ్యలో జోక్యం కల్పించుకొని మంత్రులు నెలకు వేయి రూపాయలు తీసుకొంటున్నా వారికుండే ఇబ్బందులు వారికీ వున్నాయన్నారు. లాయరుగా నెలకు రెండువేల రూపాయలు సంపాదిస్తున్న బసిరెడ్డిగారికి మంత్రుల ఇబ్బందులు ఏమీ తెలియవన్నారు.

శ్రీ ఓబులరెడ్డి పదవీస్వీకారం

వ్యవసాయం, అడవులు, మత్స్యపరిశ్రమ, పశుపోషణ శాఖల కేటాయింపు

కర్నూలు, మార్చి 15

నేటి సాయంత్రం 5 గంటలకు శ్రీ కందుల ఓబులరెడ్డిగారు రాజభవన్‌లో మంత్రిపదవీస్వీకారం చేశారు.

గవర్నరు శ్రీ త్రివేదీ శ్రీ ఓబులరెడ్డిచే అధికార ప్రమాణం చేయించారు. రాజధానిలోలేని ముఖ్యమంత్రి, ప్రణాళికశాఖమంత్రులు శ్రీ గోపాలరెడ్డి, కళా వెంకట్రావుగార్లు మినహా మిగిలిన మంత్రులందరూ హాజరయ్యారు.

కీర్తిశేషులు నీరుకొండ రామారావుగారికిచ్చిన శాఖలు వ్యవసాయం, పశుపోషణ, మత్స్య పరిశ్రమ, అడవులనే శ్రీ ఓబులరెడ్డిగారి కిచ్చారు.

బుక్కపట్నం ఆది ఆంధ్రుల దీనావస్థ

ఇండ్లవసతి కలిగించాలని అభ్యర్థన

బుక్కపట్నం, మార్చి 14

అనంతపురం జిల్లా పెనుకొండ తాలూకా రైతుసంఘ కార్యదర్శి శ్రీ యస్. గజేనాయక్ గారు యిలా వ్రాస్తున్నారు.

బుక్కపట్నం ఆదిఆంధ్రులు ఇండ్లవసతిని గురించి ఎన్నోదఫాలు మహజర్లు, విజ్ఞప్తులు పంపుకొన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదు. మాలమాదిగలకు స్వల్పస్థలంలో ఎక్కువ యిండ్లుండుటవల్ల ఇటు, అటు జానెడు స్థలానికి తగవులు ఏర్పడుచున్నవి. స్థలంచాలక వీధులంబడి కాపురాలు కొనసాగిస్తున్నారు. ఎంతోమంది ఉన్నత ఉద్యోగులు వచ్చి చూచి వెళ్లడమే కాని కావలసిన సదుపాయం కలిగించలేదు.

ఇరుకు స్థలాలలో అవస్థలుపడుతూ జీవిస్తున్న సుగాలి, మాల, మాదిగలకు విద్య, విజ్ఞానం మాట దేవుడెరుగు కాని, ఇండ్లవసతినైనా కలుగజేసి అంటురోగాలకు గురికాకుండ రక్షించడం ప్రభుత్వపు ధర్మం.

బుక్కపట్నం మాదిగ గేరిని చూడగలిగితే అది మానవులు నివసించే చోటు కాదనిపిస్తుంది. మాదిగ్గేరికి చుట్టూ పట్టాభూములున్నందున వున్న కొద్ది స్థలంలో యిరుకునబడి చావుబ్రతుకుల మీద జీవిస్తున్నారు. పంటకాలంవస్తే వీరు కదలమెదలని స్థితిలో పడిపోతారు. వీరికి ఇండ్ల వసతులు కలిగించాలనికోరుతున్నాను.

సైప్రస్‌నుంచి బహిష్కరింపబడిన ఆర్చిబిషప్ మకారియోస్ ప్రభృతులు సిషిల్లెస్ దీవులు చేరుకున్నారు.

భూమిసాగు సొసైటీలకు బంజరు భూములు

యిచ్చేవిషయం ప్రభుత్వం ఆలోచిస్తున్నదని మంత్రి శ్రీ సంజీవయ్య వెల్లడి

కర్నూలు, మార్చి 15

ప్రభుత్వ బంజర్లను భూమిసాగు సొసైటీలకు యిచ్చే విషయం ఆలోచిస్తామని సహకార శాఖామంత్రి శ్రీ డి. సంజీవయ్యగారు నేడు శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో తెలియజేశారు.

రాష్ట్రంలో 26 భూమిసాగు సొసైటీలున్నాయనీ, ఇందులో 4 గిరిజనులకు, 7 మాజీసైనికులకు, 4 ప్రజాసామాన్యానికి ఉన్నాయని తెలిపారు.

విద్యుచ్ఛక్తి సంస్థల జాతీయకరణ

విద్యుచ్ఛక్తి సంస్థలన్నిటినీ జాతీయం చేయాలని లోగడ ఆంధ్ర ప్రభుత్వం చేసిన నిర్ణయం మూడు సంవత్సరాల్లో పూర్తిగా అమలు జరుగుతుందని విద్యుచ్ఛక్తి శాఖా మంత్రి శ్రీ గౌతు లచ్చన్నగారు తెలియజేశారు. ఇప్పటికి ఇంకా 11 ప్రైవేటు విద్యుత్ సంస్థలు పని చేస్తున్నాయని అన్నారు.

పలనాడుతాలూకాలో హత్యలు

పలనాడు తాలూకాలో 1953-55 సంవత్సరాలమధ్య 30 హత్యానేరాలు జరిగాయనీ, ఇందులో 7 కేసుల్లో శిక్షలు పడ్డాయని ఉపముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డి తెలిపారు.

ముప్ఫై నేరాలలో 7 కేసుల్లో మాత్రమే శిక్షలుపడటం, మిగిలినవారిని వదలివేయడం ఎల్లా సంభవించిందన్న ప్రశ్నకు సమాధానం యిస్తూ, బాధ్యతకల్గిన వ్యక్తులు ‘పాక్షికతత్వం’ అవలంబించుతూంటే నేరస్తులు తప్పించుకొని పోతున్నారని అన్నారు.

రోడ్ల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ స్కీములు

రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధికిగాను కేంద్రప్రభుత్వం స్కీముల క్రింద 1954 – 55లో 56 వేలు, 1955లో 4 లక్షల 69 వేలు ఆంధ్రకు కేటాయించారని మరోప్రశ్నకు శ్రీ సంజీవరెడ్డి సమాధానం యిచ్చారు. చీఫ్ యింజనీరు జనవరి – మార్చి కాలానికి తలపెట్టిన స్కీముల వివరాలు తెలియజేస్తే అందుకుఎంతడబ్బుకావాలో పైకి తెలియ జేస్తామని ఆయన అన్నారు.

30,000 మంది బొంబాయి జవుళి కార్మికుల నిరసన

బొంబాయి, మార్చి 15

రాష్ట్రీయ మిల్లుమజ్దూర్ సంఘం, మిల్లు యజమానులు బోనసుల విషయంలో చేసుకొన్న ఒప్పందం కార్మికుల ప్రయోజనాలకు విరుద్ధమని నిరసిస్తూ 30 వేలమంది జవుళి కార్మికులు నేడు తమ బోనసులను తీసుకోనిరాకరించారు.

ఇండొనేషియాలో మిశ్రమ మంత్రివర్గానికి ఒప్పందం

జకార్తా, మార్చి 15

ఇండొనేషియాలో కమ్యూనిస్టు పార్టీని మినహాయించి, తమ మూడు పార్టీల ప్రతినిధులతో మంత్రివర్గం నిర్మించేందుకు నేషనలిస్టు, మాష్యుమీ, ముస్లింపండితుల పార్టీలు మూడూ ఈవేళ రాజీ కుదుర్చుకున్నాయి.

ఈ మిశ్రమ మంత్రివర్గ నిర్మాణం విషయమై సాగిన సంప్రతింపులు భగ్నమై పోతాయని నిన్న అనుకున్నారు. కాని ఆర్థికశాఖ మంత్రిత్వాన్ని తమకు ఇవ్వాలని మాష్యుమీ పార్టీ పట్టినపట్టుకీ, ఆర్థిక వ్యవహారాల శాఖను తమకివ్వాలనే ముస్లిం పండితులపార్టీ కోరికకూ నేషనలిస్టుపార్టీ లొంగడంతో ప్రతిష్ఠంభన తప్పి, రాజీ కుదిరింది.

గత సెప్టెంబరులో జరిగిన పార్లమెంటరీ ఎన్నికల్లో నేషనలిస్టు, మాష్యుమీ పార్టీలు చెరి 57 స్థానాల్లో గెలిచి ప్రథమపార్టీలుగానూ, ఆ తరువాత ముస్లిం పండితులపార్టీ ద్వితీయ పార్టీగా, కమ్యూనిస్టుపార్టీ తృతీయ పార్టీగా రూపొందిన విషయం పాఠకులకు తెలిసినదే.

జోర్డాన్, ఇరాక్ రాజుల చర్చలు

లండన్, మార్చి 14

ఇరాక్ రాజు ఫైజల్, జోర్డాన్ రాజు హుస్సేన్ నేడు వారి దేశాల సరిహద్దులలో కలుసుకుని అరబ్ సమస్యలపై చర్చలు జరిపారు. జోర్డానుకి బ్రిటనుకిమధ్య ఇరాక్ రాజు మధ్యవర్తిత్వం నెరపుతున్నట్లు భావించబడుతున్నది.

బ్రిటిష్ ప్రధాని ఈడెన్‌నుంచి ఒక సీలు చేసిన కవరు నేడు హుస్సేన్ రాజుకు అందింది.

అమెరికా రమ్మని నెహ్రూకు ఆహ్వానం

వాషింగ్టన్‌లో అధికార ప్రకటన

వాషింగ్టన్, మార్చి 14

అమెరికా సందర్శించవలసిందిగా భారత ప్రధాని నెహ్రూను ఐసెన్‌హోవర్ ఆహ్వానించినట్లు నేడు వైట్‌హౌస్ అధ్యక్షుని కార్యాలయం ప్రకటించింది.

అయితే నెహ్రూ ఈఆహ్వానాన్ని అంగీకరించిందీ, లేనిదీ, అంగీకరిస్తే ఎప్పుడు వచ్చేదీ తమకు తెలియదని అధ్యక్షుని సమాచారశాఖ ఉప కార్యదర్శి ముర్రే స్నైడర్ అన్నారు.

నెహ్రూకు ఢిల్లీలో డల్లెస్ ఈ ఆహ్వానాన్ని అందజేశారట.

గత జూలైలో నెహ్రూ ఐసెన్‌హోవర్లమధ్య కొన్ని ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి. అప్పుడు నెహ్రూను ఐసెన్‌హోవర్ ఆహ్వానించగా, తాను కొన్నేళ్ళ క్రిందట అమెరికా వచ్చినందున, ఐసెన్‌హోవర్ ఇపుడు ఇండియా రావాలని నెహ్రూ సూచించారు. ఇపుడు డల్లెస్ మళ్ళీ నెహ్రూకు ఆహ్వానం అందజేశారు.

నెహ్రూ, ఐసెన్‌హోవరులు ఒకరి దేశాన్ని ఒకరు సందర్శించడం అనేది, అందుకు ఇద్దరూ తమ సంసిద్ధతను తెలపడం దగ్గరే ఆగిపోయిందని వాషింగ్టన్‌లోని భారత రాయబార కార్యాలయంవారు తెలిపారు. ఇద్దరిలో ఎవరూకూడా తేదీని నిర్ణయించలేదన్నారు. 1956 ఆఖరు రోజుల్లో భారత దేశంలో ఎన్నికలు జరుగుతాయనీ, ఆస్ట్రేలియా మొదలైన దేశాల్లో నెహ్రూ పర్యటన కార్యక్రమాలున్నాయనీ, అందువల్ల నెహ్రూ ఇప్పట్లో రాలేరనీ వీరంటున్నారు.

అమెరికన్ న్యాయవాదికి శిక్ష

వాషింగ్టన్, మార్చి 14

అమెరికన్ కమ్యూనిస్టు నాయకుల తరఫున ఇదివరలో వాదించిన న్యాయవాది హారీ సాచర్‌పై శాసనసభ ధిక్కరణ నేరంమోపి, ఆరునెలల శిక్ష విధించారు. వేయిడాలర్ల జుల్మానా కూడా విధించారు.

మీరు కమ్యూనిస్టు పార్టీతో సంబంధంవుందా అనే ప్రశ్నకు సాచర్ జవాబు చెప్ప నిరాకరించినందున, ఆయనకు ఈశిక్ష విధించారు.

బిట్రగుంట సమీపంలో ముడి ఇనుము

బిట్రగుంట, మార్చి 14

నెల్లూరుజిల్లా బిట్రగుంట గ్రామానికి మైలు దూరంలోగల అక్కరాజు వారి ఖండ్రిక వాస్తవ్యులు పఠని గురుమూర్తి, బొద్దులూరి తిరపతయ్య గార్ల మెట్టపొలాలలో ఒక గజం లోతు త్రవ్వగా ముడిఇనుమువున్నట్లు కనుగొనబడింది. ఈ ముడి ఇనుములో 75 పాళ్ళు ఇనుము వున్నదని ఇచట భావించబడుతూంది. ఇనుము లభించిన ప్రదేశాన్ని ప్రజలంతా వెళ్ళి చూస్తున్నారు.

‘రాష్ట్రాల సమస్యపై సత్యాగ్రహాలు వద్దు’

అధీన సంఘాలకు ప్ర. సో. పార్టీ ఆదేశం

న్యూఢిల్లీ, మార్చి 15

రాష్ట్ర పునర్నిర్మాణం విషయంలో సత్యాగ్రహాలుతలపెట్టవద్దనీ, అటువంటి వాటిల్లో పాల్గొనవద్దనీ ప్ర. సో. పార్టీ జాతీయ కార్యవర్గం ఇక్కడ నాల్గురోజులుగ సమావేశమైన అనంతరం అధీన సంఘాలకు ఆదేశించింది.

శ్రీ జయప్రకాశ్ నారాయణ కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. జనరల్ కౌన్సిల్ సమావేశంలో పార్టీ అధ్యక్షుణ్ణి ఎన్నుకోవాలనీ, అంతవరకు ఉపాధ్యక్షుడుగా ఉన్న శ్రీ గంగా శరణసిన్హా అధ్యక్షుడుగా ఉండాలనీ సమావేశంవారు నిర్ణయించారు.

శ్రీ జయప్రకాశ్ నారాయణ తాను శ్రీ నెహ్రూ, పంత్ గార్లతో యితర సమస్యలతోపాటు రాష్ట్రాల సమస్యపై కూడా జరిపిన సంభాషణల వివరాలను సమావేశంవారికి తెలియజేశారు.

ప్ర. సో. పార్టీ ముఖ్యులలో ఒకరు ఈ సంభాషణలు అసంపూర్తిగా జరిగాయని తెలియజేశారు. అయితే మళ్ళీ శ్రీ నారాయణ నెహ్రూను కలుసుకుంటారనేమీ లేదని అన్నారు.

రాష్ట్రాల పునర్నిర్మాణం గురించి నిర్ణయానికి వచ్చేముందు కార్యవర్గం వారు సహాయ కార్యదర్శులు శ్రీ కె. ఆర్. కరంత్, శ్రీ అన్సారీ గార్లు సమర్పించిన నివేదికలను చర్చించారు.

వచ్చే ఎన్నికల్లో, రాష్ట్రాలవారీగా పార్టీ బలాబలాల గురించి, అవకాశాల గురించి కూడా చర్చించారు.

పలువురు సభ్యులు తమ రాష్ట్రాల పరిస్థితులు చెబుతూ, ఇటీవల రామమనోహర్ లోహియా కొత్తపార్టీ స్థాపించిన ఫలితంగా ఉద్యమంలో నష్టాలు సంభవించాయనీ, అయితే ఈ నష్టాలవలన ముంచుకొని పోయేదేమీ లేదనీ తెలిపారట.

బొంబాయి సమస్యపై పరిమిత సత్యాగ్రహం

రేపే ప్రారంభమట

పూనా, మార్చి 16

బొంబాయితో సహా సంయుక్త మహారాష్ట్రను కోరుతూ పరిమిత సత్యాగ్రహం రేపే ప్రారంభమవుతుందని సంయుక్త మహారాష్ట్రసమితి నేడు ప్రకటించింది.

రేపు మహారాష్ట్రలోని 12 జిల్లాలకు సత్యాగ్రహం దళాలను పంపిస్తారట. వీరు నిషేధాజ్ఞలను ధిక్కరించి, కలెక్టర్ల కార్యాలయాల వద్దకు ఊరేగింపులు జరుపుతారు.

రేపటి సత్యాగ్రహంలో పాల్గొనే వారి గౌరవార్థం నేడిక్కడ బహిరంగసభ జరిగింది. ఈసభలో ప్రముఖ మహారాష్ట్ర కాంగ్రెసు నాయకుడు శ్రీ జధే మాట్లాడుతూ శ్రీ మొరార్జీ దేశాయ్ బొంబాయి నగరాన్ని మహారాష్ట్రులకు దక్కకుండా చేయడానికి పెట్టుబడిదారులతో లాలూచీ అయ్యారని అన్నారు.

విశాఖ ఆర్.ఎం.ఎస్. ఉద్యోగుల సభ

విశాఖపట్నం, మార్చి 12

అఖిలభారత ఆర్. ఎం. ఎస్. యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీ ఆర్. సి. ఛటర్జీ విశాఖపట్నం వచ్చిన సందర్భంలో స్థానిక పోస్టల్ అండ్ టెలిగ్రాఫ్ యూనియన్ల ఆధ్వర్యాన బహిరంగసభ జరిగింది. శ్రీ ఎస్. సోమయాజులుగారు అధ్యక్షత వహించారు.

ఆర్. ఎమ్. ఎస్. మూడవ తరగతి ఉద్యోగుల తరఫున రు 116 ల పర్సు బహూకరించ బడింది. శ్రీ చటర్జీ పోస్టల్ అండ్ టెలిగ్రాఫ్ యూనియన్ చరిత్రను వివరించారు.

బుల్గానిన్, కృశ్చేవ్‌ల పర్యటన చిత్రం

పెకింగ్, మార్చి 13

సోవియట్ నాయకులు బుల్గానిన్, కృశ్చేవ్‌ల భారత, బర్మా దేశాల యాత్రను చిత్రించే రెండు డాక్యుమెంటరీ వర్ణచిత్రాలు ఇపుడు పెకింగ్‌లో ప్రదర్శించబడుతున్నాయి.

తిరువూరు పంచాయితీబోర్డు ఎన్నికలు

కమ్యూనిస్టు - కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్‌పత్రాల దాఖలు

తిరువూరు, మార్చి 16

కృష్ణాజిల్లా తిరువూరు పంచాయితీ ఎన్నికలు యీ నెల 28వ తేదీన జరుగుతాయి. నిన్నను నామినేషన్ పత్రాలు దాఖలుచేసారు. మొత్తం 7 వార్డులలో 11 సీట్లకు కమ్యూనిస్టు పార్టీ తరఫున 9 నామినేషన్ పత్రాలు దాఖలు చేయబడ్డాయి. కాంగ్రెసు తరఫున 11, సోషలిస్టు పార్టీ తరఫున 2, స్వతంత్రులు [illegible] నామినేషన్ పత్రాలు దాఖలుచేశారు. పోటీ చాల తీవ్రంగా వుంటుందని ఇక్కడ భావించబడుతూంది.

(వి. వి.)

వెలుగోడు ఫిర్కాలో కమ్యూనిస్టుపార్టీనిధి వసూళ్లు రు. 384

వెలుగోడు, మార్చి 14

నందికొట్కూరు తాలూకా వెలుగోడు ఫిర్కాలో కమ్యూనిస్టు పార్టీ నిధి వసూళ్ళకు యిటీవల శ్రీ సుదర్శన వర్మగారి నాయకత్వాన కార్యకర్తలు బయలుదేరి వెళ్ళారు. జనవరి మాసంలో వెలుగోడు, అబ్దుల్లాపురం, వేల్పనూరు, వేంపెంట గ్రామాలలో రైతు-కూలీలు పార్టీ నిధికి విరాళాలిచ్చారు.

వాగ్దానాలు. అబ్దుల్లాపురం రు. 145; అయ్యవారిపల్లె రు. 30; మిట్టకందాల రు. 60; వాణాల రు. 134. మద్దూరు రు. 125, మొత్తం రు. 494.

వసూళ్లు : వెలుగోడు రు. 167; అబ్దుల్లాపురం రు. 100; వాణాల రు. 112; మద్దూరు రు. 5; మొత్తం రు. 384

పెండ్లి సందర్భంలో పార్టీనిధి సమర్పణ

రేపల్లె, మార్చి 14

ఈ మధ్య శ్రీ దేవినేని సత్యనారాయణ, వెంకటనరసమ్మ గార్ల వివాహం కిష్కింధపాలెంలో జరిగింది. వధూవరులు రేపల్లె తాలూకా కమ్యూనిస్టు పార్టీ నిధికి శ్రీ కొల్లి సత్యనారాయణ గారిద్వారా రు. 7-0-0 పంపారు.

సంక్షిప్త వార్తలు

ఉరవకొండ

అనంతపురం జిల్లా ఉరవకొండ పట్టణకమిటీ యాజమాన్యాన ఈ నెల 12న జరిగిన బహిరంగసభకు శ్రీ వి. కె. ఆదినారాయణరెడ్డిగారు అధ్యక్షత వహించారు. కమ్యూనిస్టు పార్టీ ఆశయాలను, విధానాలను వివరిస్తూ రాష్ట్ర కమ్యూనిస్టు నాయకులు శ్రీ తరిమెల నాగిరెడ్డి, శ్రీ చంద్ర పుల్లారెడ్డిగార్లు ఉపన్యసించారు. ప్రజల హక్కులకై పోరాడే కమ్యూనిస్టు పార్టీకి విరాళాలిచ్చి తోడ్పడవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

పాతగుంట

చిత్తూరుజిల్లా పుత్తూరుతాలూకా పెనుమూరు - నగరంరోడ్డు చాలా అధ్వాన్నస్థితిలో వుంది. బస్సులు, బండ్లూ, సైకిళ్ళు యీ రోడ్డుపై ప్రయాణంచేయడం దుర్లభం. అయినా జిల్లా అధికారులుగాని, బోర్డువారుగాని దీని మరమ్మతులను గురించి ఆలోచించుట లేదు. ఈ రోడ్డుపై ప్రయాణించేవారి అవస్థలను గుర్తించి అధికారులు వెంటనే రోడ్డు మరమ్మతులకు పూనుకోవాలని పాతగుంట గ్రామాభ్యుదయ సంఘంవారు ఆందోళన సాగిస్తున్నారు.

సైదాపురం

నెల్లూరుజిల్లా రాపూరుతాలూకా సైదాపురంలో సిద్ధేశ్వరి యువజన నాట్యమండలి ప్రథమ వార్షికోత్సవ సభలు ఇటీవల జరిగాయి. ఈ సందర్భంలో సైదాపురం యువజనమండలి వారిచే గయోపాఖ్యాన నాటకం ప్రదర్శించబడింది. పరిసరగ్రామాల నుండి 3 వేలకు పైగా ప్రజలు వచ్చారు.

ఐర్లండ్ విభజనదృష్ట్యా తమదేశం ఉత్తర అట్లాంటిక్ కూటమిలో చేరబోదని ఐరిష్ ప్రధాని జాన్ కాస్టెల్లో ప్రకటించారు.

సంపాదకుడు, ముద్రాపకుడు, ప్రచురణకర్త.— కాట్రగడ్డ రాజగోపాలరావు—ముద్రణ : ప్రజాశక్తి ఆర్టు ప్రింటర్సు, బకింగ్‌హాం పేట, విజయవాడ. సంపాదకవర్గం :— మోటూరు హనుమంతరావు, [అధ్యక్షులు] కంభంపాటి సత్యనారాయణ, కాట్రగడ్డ రాజగోపాలరావు.